

RNI NO.TGTEL/25/A5224

జోర్దార్

JORDAR TELUGU DAILY ధి తెలుగు దినపత్రిక

అవినీతి అంతం - మా పంతం



కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 290 శనివారం, నవంబర్ 07 2026 , పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

జనగామ మహిళా శిశు సంక్షేమ శాఖలో బదిలీల బాగోతం.. **ఐవీఎఫ్ కేంద్రాల అక్రమాలకు చెక్..**

ఈవోలపై వేధింపులా?

- ఎక్టెన్షన్ ఆఫీసర్లను ఒక ప్రాజెక్టు నుంచి మరో ప్రాజెక్టుకు మార్పు
- రోజుకు 15 అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన.. యాప్‌ల నమోదుతో అదనపు భారం
- దివ్యాంగులు, అనారోగ్య సమస్యలున్న ఉద్యోగులకూ తప్పని స్థానచలనం
- బదిలీల అధికారాలు ఆర్జేడీకి మాత్రమే ఉన్నాయంటున్న అసోసియేషన్
- జిల్లా కలెక్టర్ తీరుపై తీవ్ర అభ్యంతరం.. అధికారుల పాత్రపైనా ఆరోపణలు
- సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క జోక్యం చేసుకోవాలని డిమాండ్



జనగామ జోర్దార్ నిఘా విభాగం

జనగామ జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖలో ఎక్టెన్షన్ ఆఫీసర్ల ప్రాజెక్టుల మార్పు వ్యవహారం తీవ్ర వివాదానికి దారితీస్తోంది. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పలువురు ఎక్టెన్షన్ ఆఫీసర్లను ఒక ప్రాజెక్టు నుంచి మరో ప్రాజెక్టుకు మార్చడంపై ఉద్యోగుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారితో పాటు కొత్తగా గ్రేడ్–1 హోదా పొందిన వారిని సైతం వారికి కేటాయించిన ప్రాజెక్టుల నుంచి వేరే ప్రాజెక్టులకు మార్చారని అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఒకే ప్రాజెక్టు పరిధిలో సెక్టార్ల మార్పు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ, ఒక ప్రాజెక్టు నుంచి మరో ప్రాజెక్టుకు మార్చే అధికారం అధికారులకు లేదని వారు స్పష్టం చేస్తున్నారు.

రోజుకు 15 కేంద్రాల సందర్శన.. యాప్‌లతో అదనపు భారం

ఎక్టెన్షన్ ఆఫీసర్లు రోజుకు 15 అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలనే ఆదేశాలు ఇవ్వడంతో క్షేత్రస్థాయిలో తీవ్ర పని ఒత్తిడి నెలకొందని ఉద్యోగులు వాపోతున్నారు. ఇప్పటికే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు సంబంధించిన యాప్‌లలో వివరాలు నమోదు చేస్తున్నామని, తాజాగా ‘శిశు సంవృద్ధి’ యాప్‌లోనూ వివరాలు నమోదు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని చెబుతున్నారు. క్షేత్రస్థాయి విధులతో పాటు వివిధ యాప్‌ల నిర్వహణ అదనపు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగులు, అనారోగ్య సమస్యలున్న వారినీ వదలరా?

ప్రాజెక్టుల మార్పుల్లో ఉద్యోగుల వ్యక్తిగత పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దివ్యాంగ ఉద్యోగులతో పాటు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని సైతం దూర ప్రాంతాల్లోని ప్రాజెక్టులకు మార్చారని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొంటున్నారు. సాధారణ బదిలీల సమయంలో దివ్యాంగ ఉద్యోగులు కోరుకున్న ప్రాంతాల్లోనే కొనసాగించేలా అవకాశం కల్పించాలని ఇటీవల మంత్రి సీతక్క సూచించినప్పటికీ, జనగామ జిల్లాలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ముగ్గురుసీడీపీవోలు రిలీవింగ్ లెటర్లు ఇచ్చినట్లు వెల్లడించారు.

ప్రాజెక్టుల మార్పు అధికారం ఎవరికి?

ఎక్టెన్షన్ ఆఫీసర్ల పోస్టులు జోనల్ కేడర్‌కు సంబంధించినవని, ఒకసారి ప్రాజెక్టు కేటాయించిన తర్వాత సాధారణ బదిలీలు జరిగే వరకు అక్కడే కొనసాగించాల్సి ఉంటుందని అసోసియేషన్ వాదిస్తోంది. ఉద్యోగులకు వ్యక్తిగత సమస్యలు ఉంటే డిప్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని, అలాంటి డిప్యుటేషన్‌కు ఆర్జేడీ స్థాయి అధికారి మాత్రమే అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంటోంది. జిల్లా అధికారులు, సీడీపీవోలకు ఇష్టానుసారంగా ఒక ప్రాజెక్టు నుంచి మరో ప్రాజెక్టుకు మార్చే అధికారం లేదని స్పష్టం చేస్తోంది.

సీనియర్ అసిస్టెంట్లు, సీడీపీవోల పాత్రపైనా ఆరోపణలు

జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు రామారావు, సంపత్‌తో పాటు ప్రస్తుతం ఇన్‌చార్జి డీడబ్ల్యూవో బాధ్యతలు చేపట్టాలని ప్రయత్నిస్తున్న చంద్రిక అనే సీడీపీవో పాత్ర కూడా ఈ ప్రాజెక్టుల మార్పుల్లో ఉందని అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. వీరి ప్రమేయంతోనే ఈవోలను ఒక ప్రాజెక్టు నుంచి మరో ప్రాజెక్టుకు మార్చే ప్రక్రియ జరిగిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణ తెలియాల్సి ఉంది.

కేసులు పెట్టుకోండి.. కోర్టుకు వెళ్లండి అన్నారా?

ఈవోల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు టీ ఈవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సూర్యకళ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం వెళ్లినట్లు సమాచారం. అయితే సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, మీరే కేసులు పెట్టుకోండి.. కోర్టుకు వెళ్లండంటూ సమాధానం ఇచ్చారని అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. దీంతో ఉద్యోగుల సమస్యలపై అధికారుల నుంచి సానుకూల స్పందన లభించడం లేదనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇతర శాఖల ఉద్యోగుల విషయంలోనూ ఇష్టానుసారంగా మార్పులు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ నేపథ్యంలో జనగామ జిల్లా కలెక్టర్ వ్యవహారశైలితో పాటు ప్రాజెక్టుల మార్పుల్లో కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీడీపీవోలు, సీనియర్ అసిస్టెంట్ల పాత్రపై సమగ్ర విచారణ జరిపించాలని అసోసియేషన్ డిమాండ్ చేస్తోంది. ఉద్యోగులపై పని ఒత్తిడిని తగ్గించడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ప్రాజెక్టుల మార్పులను నిలిపివేయాలని కోరుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తక్షణమే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే న్యాయపోరాటానికి సైతం సిద్ధమని అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు.

ఉల్లంఘిస్తే శాశ్వతంగా లైసెన్స్ రద్దు!

- అండాల అక్రమ సేకరణ ముఠాలతో సంబంధాలుంటే కఠిన చర్యలు
- బాధ్యులైన వైద్యులపై వేట..
- సరోగసి, ఏఆర్‌టీ చట్టాల అమలుకు ప్రత్యేక కమిటీ



హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి

రాష్ట్రంలో ఐవీఎఫ్ కేంద్రాల పేరుతో సాగుతున్న అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ వేగవంతం చేసింది. సంతానలేమి సమస్యతో చికిత్స కోసం వచ్చే దంపతులను లక్ష్యంగా చేసుకుని అండాల అక్రమ సేకరణ, దోపిడీకి పాల్పడే సంస్థలపై ఏమాత్రం ఉపేక్షించేది లేదని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడుతున్న కేంద్రాల రిజిస్ట్రేషన్లను శాశ్వతంగా రద్దు చేయడంతో పాటు, వాటికి సహకరించిన వైద్యుల లైసెన్సులు కూడా రద్దు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గతంలో సృష్టి ఫర్టిలిటీ సెంటర్ వ్యవహారంలో అక్రమాలను అడ్డుకున్న ప్రభుత్వం, తాజాగా అండాల అక్రమ సేకరణకు పాల్పడుతున్న ముఠాను గుర్తించడంతో ప్రైవేట్ ఐవీఎఫ్ కేంద్రాలపై నిఘా మరింత పెంచింది. ఈ నేపథ్యంలో కోఠిలోని టీజీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అక్రమాలకు సంబంధం ఉన్న వ్యక్తులు, సంస్థలపై సమగ్ర విచారణ జరిపి దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సరోగసి, ఏఆర్‌టీ చట్టాల అమలును పటిష్టం చేసేందుకు ఇతర రాష్ట్రాల విధానాలను అధ్యయనం చేయడానికి నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఐవీఎఫ్ చికిత్సకు వినియోగించే మందుల తయారీ నుంచి విక్రయాల వరకు డ్రగ్ కంట్రోల్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని, ప్రభుత్వ ఐవీఎఫ్ సేవల విస్తరణను వేగవంతం చేయాలని మంత్రి స్పష్టం చేశారు. సమీక్షలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ముషారఫ్ అలీ ఫారూఖీతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల పేరుతో భారీ దందా.. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.5 లక్షల వసూలు!



హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి

ఉస్మానియా ఆసుపత్రి కేంద్రంగా కారుణ్య నియామకాల కోసం నకిలీ మెడికల్ ఇన్వాల్యుయేషన్ సర్టిఫికెట్ల దందా సాగుతోందనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఉద్యోగి ఆరోగ్య పరిస్థితి విధులు నిర్వహించలేని స్థాయిలో ఉందంటూ సర్టిఫికెట్ ఇప్పించేందుకు రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. మెడికల్ బోర్డు నిర్వహించే వైద్య పరీక్షల నివేదికలను తారుమారు చేసి, ఆరోగ్యంగా ఉన్న ఉద్యోగులను సైతం విధులు నిర్వర్తించలేని వారిగా చూపిస్తూ సర్టిఫికెట్లు సృష్టిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో మెడికల్ రికార్డు విభాగానికి చెందిన కొందరి పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతి?

మరోవైపు ఉస్మానియా ఆసుపత్రిలో మెడికల్ రికార్డు టెక్నీషియన్‌గా పనిచేస్తున్న ఉద్యోగి విద్యార్హత, పదోన్నతులపై కూడా వివాదం నెలకొంది. పదోన్నతికి ఇంటర్మీడియట్ అర్హత అవసరమని చెబుతుండగా, సర్వీస్ రికార్డులో మాత్రం పదో తరగతి మాత్రమే సమోదై ఉన్నట్లు సమాచారం. అలిమ్/ఫాజిల్ ధ్రువపత్రం ఆధారంగా పదోన్నతి పొందారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ సర్టిఫికెట్ చెల్లుబాటు, పదోన్నతి ప్రక్రియపై విచారణ జరపాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

35 మంది ఉద్యోగుల నుంచి లక్షల వసూళ్లు?

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 మంది ఉద్యోగుల నుంచి కారుణ్య నియామకాల కోసం సర్టిఫికెట్లు ఇప్పిస్తానంటూ లక్షల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2025 మార్చిలో కరీంనగర్ ప్రాంతంలో నకిలీ మెడికల్ ఇన్వాల్యుయేషన్ సర్టిఫికెట్ వ్యవహారం వెలుగులోకి వచ్చి, ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేయడం ఈ ఆరోపణలకు మరింత ప్రాధాన్యత తెచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో సంబంధిత ఉద్యోగి వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకుని, అనంతరం ఉపసంహరించుకున్నారనే ప్రచారం కూడా సాగుతోంది.ఇప్పటికే పలువురు బాధితులు ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, నకిలీ సర్టిఫికెట్లు సృష్టించిన వారితో పాటు వాటి ఆధారంగా అక్రమంగా కారుణ్య నియామకాలు, పొందిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాగితాల పై పచ్చని బడి నేల మీద అంతా చెత్త

- స్వచ్ఛ పాఠశాల పురస్కాల కోసం పైరవీలు
- లేని గొప్పతనం ఉన్నట్టు చూపి బహుమతి దోచుకునే కుట్ర
- పరిశీలన లేకుండానే పురస్కారం - తప్పుడు వివరాలతో తెర వెనుక నాటకంలి
- బడిని బాగుచేయకుండా బహుమతిని మాత్రం కొట్టేయాలన్న తాపత్రయం
- పరిశీలన బృందాన్నే కొనేసి పురస్కారం తెచ్చుకునే ఎత్తుగడ



(కరీంనగర్ జోర్దార్ ప్రతినిధి)

1. మంచి ఆలోచనకు మోసం అంటుకుంది

కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం పాఠశాలలు ఎంత పరిశుభ్రంగా, ఎంత పచ్చగా ఉన్నాయో స్వయంగా లెక్కవేసుకునే విధానం తెచ్చింది. ప్రమాణాలు పాటించే పాఠశాలలకు పురస్కారాలతో పాటు లక్ష రూపాయల నగదు బహుమతి ఇవ్వడం ఆనవాయితీ. బడులు బాగుపడాలనే మంచి ఆలోచనతో వచ్చిన ఈ విధానం ఇప్పుడు మోసాలకు వేదికగా మారింది.

2. స్వయం లెక్కే అలుసుగా మారింది

ఎలాగూ స్వయంగా లెక్క వేసుకునేదే కదా అని కొందరు పెద్దలు తప్పుడు వివరాలకు నడుం కట్టారు. అనేక అంశాల్లో ఎక్కువ మార్కులు పెద్ద పాఠశాలలకే వచ్చే అవకాశం ఉండటంతో ఉన్నత స్థాయి ప్రధానోపాధ్యాయులు తమ పలుకుబడిని వాడుతున్నారు. లేని సౌకర్యాలు ఉన్నట్టు, జరగని పనులు జరిగినట్టు రాస్తున్నారు.

3. విరమణ చెందినా వదలని బహుమతి దాహం

గతంలో బహుమతులు పొందిన వారు విరమణ చెందినా ఆయా పాఠశాలల వివరాలు దగ్గర ఉండి రాయించి మళ్ళీ బహుమతి పొందేందుకు, ఆ ఖ్యాతిని కొట్టేందుకు కుటిల యత్నాలు చేస్తున్నారు. వారి స్నేహితులకు వివరాలు ఇలా రాస్తే బహుమతి వస్తుంది అంటూ సలహాలు ఇవ్వడమే కాదు, ఇంటికి పిలిపించి అంతర్జాలవేదికలోసూచికలనుస్వయంగా నింపడం కనిపించింది.

4. బడికి పోకుండానే బాగుచేసినట్టు గొప్పలు

సంఘాల నాయకులు పాఠశాలకు వెళ్ళకున్నా పాఠశాలను బాగుచేసినట్టు గొప్పలు చెబుతూ, రాష్ట్ర కేంద్ర వేదికలపై బహుమతులు పొందేందుకు అక్రమాలకు తెర తీసినట్టు సమాచారం అందుతోంది. బాధ్యతాయుతమైన స్థానంలో ఉంటూ, మరోవైపు రాష్ట్ర స్థాయి నాయకులుగా ఉంటూ పాఠశాలను పట్టించుకోకుండా వారు ఇలాంటి అక్రమ మార్గంలో వెళ్ళడానికి ప్రయత్నిస్తుండటం చూస్తే ఈ లెక్కింపులో ఎంత కంపు నిండుకుందో అర్థమవుతోంది.

5. పరిశీలన బృందంలోనే కుమ్మక్కు

వివరాలను పరిశీలన చేసేందుకు ఒక బృందం ఏర్పాటు చేయగా, ఆ బృంద నాయకులు ఉన్నత స్థాయి ప్రధానోపాధ్యాయులు కావడంతో వారి సహాయం తీసుకుని, వారితో కుమ్మక్కై ఎలాగైనా బహుమతి పొందడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ఫలానా పాఠశాలలో ఏమీ లేదని తెలిసి ఆయా బృంద నాయకులు ఆ పాఠశాలకు తాము వెళ్ళమని మొరాయించి కూర్చున్నట్టుగా, వారి స్థానంలో తమకు అనుకూలంగా ఉండే వారిని పిలిపించుకుని మమ అని రాయించుకోవడానికి తెగించారు.

6. జిల్లా కేంద్రంలో ముందస్తు విందులు

జిల్లా కేంద్రంలో వారికి ముందస్తుగా విందులు ఇవ్వడానికి తెగించారంటే బహుమతులు మరియు నగదు బహుమతి మీద ఎంత కన్ను వేశారో అర్థం చేసుకోవచ్చు. పరిశీలనకు వెళ్ళాల్సిన వారికే విందులు ఇస్తే ఇక నిజం ఎక్కడ బయటపడుతుంది? ఇది పరిశీలనా? లేక బహుమతి కొనుగోలు చేసుకునే పద్ధతా? అని విద్యాభిమానులు ప్రశ్నిస్తున్నారు.

7. విధుల నుండి తొలగించబడిన ప్రధానోపాధ్యాయుడి వింత

ఒక జిల్లాలో తాత్కాలికంగా విధుల నుంచి తొలగించబడిన ఒక ప్రధానోపాధ్యాయుడు అక్రమంగా ఈ బహుమతి పొందడానికి లెక్కింపును తప్పుగా చూపిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. విధుల్లో లేకున్నా పాఠశాల వివరాలపై పెత్తనం చెలాయిస్తూ, తప్పుడు వివరాలు నమోదు చేయిస్తున్నాడని చెబుతున్నారు. ఇది నిజమైతే ఇంతకన్నా సిగ్గుచేటు మరొకటి ఉండదు.

8. పెద్ద మనుషుల పాఠశాలల్లోనే మాయ వివరాలు

చిన్న పాఠశాలలు నిజాయితీగా ఉన్నా, పెద్ద మనుషుల పాఠశాలల్లోనే మాయ వివరాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. పైకి మెరిసే పండు చందంగా పాఠశాలలు కనిపిస్తున్నా, లోపలికి అసలు పరిస్థితి వేరేలా ఉంటోందని తల్లిదండ్రులు చెబుతున్నారు.

9. నిధులు జేబుల్లోకి – బహుమతులు చేతుల్లోకి

ఒకవైపు వచ్చే నిధులను జేబుల్లోకి వేసుకోవాలని చూస్తూ, ఏమీ లేకున్నా బహుమతులు పొందాలనే ఆలోచన ఉన్న ఉపాధ్యాయుల నడుమ ఎలాంటి సమాజం రూపుదిద్దుకోబోతోందో ఆలోచిస్తే భయం కలుగుతోంది. పిల్లలకు నిజమైన పరిశుభ్రత, పచ్చదనం నేర్పాల్సిన వారే ఇలా మోసానికి దిగితే పిల్లలు ఏమి నేర్చుకుంటారు?

10. రాష్ట్ర స్థాయి స్వతంత్ర అధికారులు స్వయంగా తనిఖీ చేయాలి

అన్ని పాఠశాలలను స్వయంగా స్వతంత్ర తనిఖీ చేయాలని, ఏమైనా తప్పుడు వివరాలు ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. రాష్ట్ర స్థాయిలో ఈ వివరాల మీద వెంటనే బృందాలను వేసి సరైన రీతిలో లెక్కింపు చేయాలని విద్యాభిమానులు డిమాండ్ చేస్తున్నారు. తప్పుడు వివరాలు ఇచ్చిన పాఠశాలలను బహుమతి జాబితా నుంచి తొలగించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఈ లెక్కింపుకు విలువ ఉంటుందని వారు స్పష్టం చేస్తున్నారు.

సంపాదకీయం

అన్నదాతను కాటేసిన వరుస తుపాన్లు!

● పంట నష్టాలతో రైతులకు తీరని వేదన.. ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే!

ప్రకృతి వైపరీత్యాలను ఆపడం మనిషి చేతుల్లో లేని పని. అయితే ముందస్తు హెచ్చరికలు, అప్రమత్తత, సమర్థవంతమైన సహాయక చర్యల ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను వరుసగా వణికించిన అర్నబ్, మురసు తుపాన్లు ఈ విషయాన్ని మరోసారి నిరూపించాయి. భారీ వర్షాలు, ప్రచండ గాలులు, వరదలతో జనజీవనం అస్తవ్యస్తమైనప్పటికీ ముందస్తు హెచ్చరికల వల్ల ప్రాణనష్టాన్ని కొంతవరకు నియంత్రించగలిగారు. కానీ రైతులకు జరిగిన అపార పంట నష్టాన్ని పూడ్చడం ఇప్పుడు ప్రభుత్వాల ముందున్న అతిపెద్ద సవాలు.అక్టోబర్ 28న ఆంధ్రప్రదేశ్ తీరాన్ని తాకిన అర్నబ్ తుపాను తీవ్ర విధ్వంసం సృష్టించింది. ప్రాథమిక అంచనాల ప్రకారం 3.52 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, మరో 23,383 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. సుమారు 4.63 లక్షల మంది రైతులు నష్టపోయారు. ఈ తుపాను కారణంగా ఏడుగురు మరణించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలో ప్రాథమికంగా రూ.4,764 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.అర్నబ్ తుపాను ప్రభావం నుంచి రైతులు కోలుకోకముందే మురసు తుపాను మరోసారి విరుచుకుపడింది. నవంబర్ 3న తీరాన్ని దాటిన ఈ తుపాను కారణంగా 50,473 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. 69,828 మంది రైతులు నష్టపోయారు. వ్యవసాయ రంగానికి సంబంధించి రూ.324.22 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. ఈ తుపాను కారణంగా మరో ఇద్దరు మరణించారు. తెలంగాణలోనూ మురసు ప్రభావంతో ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిసి వరి, పత్తి వంటలు దెబ్బతిన్నాయి.ఈ విపత్తుల సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినియోగించిన రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) సాంకేతిక పరిజ్ఞానం ప్రత్యేకంగా ప్రస్తావించదగినది. తుపాను తీరాన్ని తాకడానికి ఆరు రోజుల ముందుగానే ప్రజలను అప్రమత్తం చేశారు. 7.23 కోట్ల మంది మొబైల్ వినియోగదారులకు హెచ్చరికలు పంపించారు. 34,716 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. 2,199 తుపాను ఆశ్రయ కేంద్రాలను సిద్ధం చేశారు. వివిధ శాఖల మధ్య సమన్వయం, నిరంతర పర్యవేక్షణ, వాట్సాప్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ, తక్షణ పరిష్కారం వంటి చర్యలు విపత్తు నిర్వహణలో సాంకేతికత ప్రాధాన్యతను చాటాయి. ప్రకృతి విపత్తుల సమయంలో సరైన సమాచారం అందించడం ప్రాణాలను కాపాడే ఆయుధంగా మారుతుందని ఈ అనుభవం స్పష్టం చేసింది.తెలంగాణలోని ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు వద్ద చోటుచేసుకున్న ఘటన సహాయక సిబ్బంది సాహసానికి నిదర్శనం. వరద నీటిలో చిక్కుకున్న మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖలకు చెందిన పది మంది సిబ్బంది పడవలు బోల్తాపడటంతో గల్లంతయ్యారు. అయితే రాత్రంతా సాగిన గాలింపు చర్యల అనంతరం ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది వారందరినీ సురక్షితంగా రక్షించారు. విపత్తుల సమయంలో సహాయక సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయం.అయితే తుపాన్ల వల్ల జరిగిన పంట నష్టాన్ని కేవలం గణాంకాలుగా చూడలేం. నెలల తరబడి కష్టపడి, అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట చేతికందే సమయంలో నీటిపాలైతే రైతు పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో అర్థం చేసుకోవాలి. ఒకవైపు పెట్టుబడి నష్టం, మరోవైపు అప్పుల భారం, ఇంకోవైపు కుటుంబ పోషణ బాధ్యతలు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.

అగ్నివీర్ మార్పులతో అసలైన ఊరట ఏది?

రెండేళ్ల సర్వీసు పాడిగింపుతో సమస్యలు పరిష్కారమవుతాయా? యువత భవిష్యత్తుపై ఇంకా వీడని అనిశ్చితి!



దేశ రక్షణ రంగంలో సైనిక నియామకాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకంలో తాజాగా చేసిన మార్పులు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. నాలుగేళ్ల సర్వీసు ముగిసిన తర్వాత 75 శాతం మంది అగ్నివీరులను విధుల నుంచి తప్పించాలనే నిబంధనపై గతంలో తీవ్ర విమర్శలు వచ్చాయి. యువత భవిష్యత్తు, ఉద్యోగ భద్రత, సైనికుల వృత్తిపరమైన నైపుణ్యం వంటి అంశాలపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అగ్నివీరుల సర్వీసును మరో రెండేళ్లు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ మార్పులు అగ్నివీరులకు నిజమైన భరోసా కల్పిస్తాయా? లేక సమస్యను మరో రెండేళ్లు వాయిదా వేసినట్లేనా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.2022లో కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. సైనిక దళాల్లో యువతకు అవకాశం కల్పించడం, సైనికుల సగటు వయసును తగ్గించడం, రక్షణ రంగంలో వేతనాలు, పింఛన్ల భారం తగ్గించడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలుగా ప్రకటించింది. ఈ పథకం కింద ఎంపికైన యువతకు నాలుగేళ్ల పాటు సైన్యంలో పనిచేసే అవకాశం కల్పించారు. ప్రతి బ్యాచ్‌లో 25 శాతం మందిని మాత్రమే అర్హత, ప్రతిభ ఆధారంగా పూర్తిస్థాయి సైనిక సేవల్లో కొనసాగించేందుకు అవకాశం ఇచ్చారు. మిగిలిన 75 శాతం మంది నాలుగేళ్ల తర్వాత సైన్యం నుంచి బయటకు రావాల్సి ఉంటుంది. వారికి సేవానిధి ప్యాకేజీ అందించినప్పటికీ, సాధారణ సైనికులకు లభించే పింఛను, ఇతర దీర్ఘకాలిక ఉద్యోగ భద్రత ప్రయోజనాలు ఉండవు.ఈ నిబంధనలపై పథకం ప్రారంభమైనప్పటి నుంచే యువతలో అసంతృప్తి వ్యక్తమైంది. సైన్యంలో చేరాలనే లక్ష్యంతో ఏళ్ల తరబడి శిక్షణ పొందిన యువకులు కేవలం నాలుగేళ్లకే బయటకు రావాల్సి రావడం ఆందోళనకు గురిచేసింది. దేశ రక్షణ కోసం కఠినమైన శిక్షణ పొందిన యువతకు ఆ తర్వాత సరైన ఉపాధి అవకాశాలు కల్పించడంపై స్పష్టత లేకపోవడం మరో సమస్యగా మారింది. సైనిక శిక్షణ పొందిన వ్యక్తుల నైపుణ్యాలను దేశంలోని ఇతర రంగాల్లో వినియోగించుకునేలా తగిన వ్యవస్థలు ఏర్పాటు చేయాలనే డిమాండ్లు కూడా వినిపించాయి.తాజాగా కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం ప్రకారం నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న అగ్నివీరుల్లో మొదట 25 శాతం మందిని గతంలో మాదిరిగానే రెగ్యులర్ సర్వీసులోకి ఎంపిక చేస్తారు. మిగిలిన 75 శాతం మందికి మరో రెండేళ్లు సర్వీసులో కొనసాగేందుకు అవకాశం కల్పిస్తారు. ఈ అదనపు కాలంలో వారికి ప్రస్తుత వేతనం కంటే ఎక్కువ పారితోషికం అందించనున్నారు. ఆరేళ్ల సర్వీసు పూర్తయిన తర్వాత ఆసక్తి, అర్హత కలిగిన వారు నిర్దేశిత ఎంపిక ప్రమాణాలకు అనుగుణంగా పూర్తిస్థాయి సైనిక సేవల్లో చేరేందుకు మరో అవకాశం పొందుతారు.ఈ నిర్ణయం వల్ల తొలి బ్యాచ్‌కు చెందిన వేలాది మంది అగ్నివీరులకు తాత్కాలికంగా ఊరట లభించినట్లయింది. అయితే అదనంగా రెండేళ్లు పనిచేసిన తర్వాత కూడా శాశ్వత ఉద్యోగం లభిస్తుందనే హామీ లేదు. ఎంపిక ప్రమాణాలు, ఖాళీలు, సర్వీసు నిబంధనలు వంటి అంశాలపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. అంటే నాలుగేళ్ల తర్వాత ఎదురయ్యే అనిశ్చితి మరో రెండేళ్లకు వాయిదా పడినట్లే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇక్కడ మరో కీలకమైన అంశం భారత సైనిక దళాల వృత్తిపరమైన సామర్థ్యం. ఒక సైనికుడు పూర్తిస్థాయి నైపుణ్యం సంపాదించడానికి కేవలం శారీరక దృఢత్వం, సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే సరిపోవు. యుద్ధ అనుభవం, క్రమశిక్షణ, సహచరులతో సమన్వయం, ఆయుధాల వినియోగంలో పట్టు, క్లిష్ట పరిస్థితుల్లో నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం ఎంతో అవసరం. ఇవన్నీ దీర్ఘకాలిక సేవ, నిరంతర శిక్షణ, అనుభవం ద్వారా అభివృద్ధి చెందుతాయి. నాలుగేళ్లకే ఎక్కువమంది సైనికులు బయటకు వెళ్లిపోతే సైన్యంలో అనుభవజ్ఞుల కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్న రక్షణ రంగ నిపుణుల అభిప్రాయాలను విస్మరించలేం. సైన్యం అనేది సాధారణ ఉద్యోగ సంస్థ కాదు. దేశ సార్వభౌమత్వాన్ని, భద్రతను కాపాడే అత్యంత కీలకమైన వ్యవస్థ. అందులో పనిచేసే సైనికులకు దీర్ఘకాలిక ఉద్యోగ భద్రత, తగిన గౌరవం, భవిష్యత్తుపై భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత. కేవలం యువ సైనికులతో దళాలను నింపడం వల్లనే రక్షణ సామర్థ్యం పెరగదు. అనుభవం, నైపుణ్యం, అంకితభావం, సైనికుల మధ్య పరస్పర విశ్వాసం కూడా అంతే ముఖ్యం.నాలుగేళ్ల తర్వాత సైన్యం నుంచి బయటకు వచ్చే యువత భవిష్యత్తు మరో ప్రధాన సమస్య. సైన్యంలో చేరాలనే ఆశతో సాధారణ ఉద్యోగ అవకాశాలను వదులుకుని, శారీరకంగా, మానసికంగా కఠినమైన శిక్షణ పొందిన యువతకు బయటకు వచ్చిన తర్వాత తగిన ఉద్యోగాలు లభించకపోతే వారి పరిస్థితి ఏమిటి? పోలీసు, పారా మిలటరీ దళాలు, ఇతర ప్రభుత్వ విభాగాల్లో ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పడం మాత్రమే సరిపోదు. ఆ హామీలు వాస్తవ రూపం దాల్చాలి. ప్రైవేటు రంగంలోనూ అగ్నివీరుల శిక్షణ, క్రమశిక్షణ, సాంకేతిక నైపుణ్యాలకు తగిన గుర్తింపు కల్పించాలి.అగ్నిపథ్ పథకంలో మార్పులు చేయడం ద్వారా ప్రభుత్వం గతంలో వ్యక్తమైన విమర్శలను పరిగణనలోకి తీసుకున్నట్లు కనిపిస్తోంది. అయితే ఈ మార్పులు సమగ్ర పరిష్కారంగా మారాలంటే మరిన్ని చర్యలు అవసరం. అగ్నివీరుల శాశ్వత నియామకానికి స్పష్టమైన విధానం రూపొందించాలి. ఎంపిక ప్రక్రియలో పారదర్శకత ఉండాలి. సర్వీసు పూర్తిచేసుకున్న వారికి ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, ఉన్నత విద్యలో అవకాశాలు కల్పించాలి. సైనికుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై మాజీ సైనికులు, రక్షణ నిపుణులు, యువత అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి.దేశ రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడం ఎంత ముఖ్యమో, ఆ రక్షణ బాధ్యతలు నిర్వహించే సైనికుల జీవితాలకు భద్రత కల్పించడం కూడా అంతే ముఖ్యం. దేశభక్తితో సైన్యంలో చేరుతున్న యువతకు భవిష్యత్తుపై నమ్మకం కలిగించాలి. కేవలం సర్వీసు కాలాన్ని రెండేళ్లు పొడిగించడం వల్ల అన్ని సమస్యలూ పరిష్కారం కావు. అగ్నివీరులకు శాశ్వత ఉద్యోగ భద్రత, మెరుగైన సేవా నిబంధనలు, గౌరవప్రదమైన భవిష్యత్తు కల్పించే దిశగా ప్రభుత్వం సమగ్ర విధానాన్ని రూపొందించాలి. దేశం కోసం సేవ చేయాలనే యువత ఆకాంక్షలకు భరోసా కల్పించినప్పుడే అగ్నిపథ్ పథకం అసలు లక్ష్యం నెరవేరుతుంది.

సార్టెక్స్ పేరుతో పౌరసరఫరాల శాఖ అధికారిఅరాచకం: జమ్మికుంటలో రైస్ మిల్లర్లపై అధికారుల పక్షపాతం!

(కొందరిపై ప్రేమ.. మరికొందరిపై కక్ష సాధింపు? సీఎంఆర్ ధాన్యం కేటాయింపుల్లో బిగ్ స్కామ్!)

(?జమ్మికుంట జోర్దార్ ప్రతినిధి)

కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో పౌరసరఫరాల శాఖ (సివిల్ సప్లైస్) అధికారుల తీరు తీవ్ర వివాదాస్పదంగా మారింది. నిబంధనలను తమకు నచ్చినట్లు మలుచుకుంటూ, కొందరు బడా మిల్లర్లతో కుమ్మక్కై , చిన్న మిల్లర్ల పొట్ట కొడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం విధించిన నిబంధనలను కొందరికి మినహాయిస్తూ, మరికొందరిపై మాత్రం నిబంధనల పేరుతో వేధింపులకు గురిచేస్తుండటంపై స్థానిక మిల్లర్లు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.?2024-25 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం సార్టెక్స్ యంత్రాలు, బ్లెండింగ్ మెషినరీ ఉన్న రైస్ మిల్లులకే ధాన్యం కేటాయించాలని స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే జమ్మికుంటలోని పౌరసరఫరాల శాఖ అధికారులు ఈ నిబంధనలను దారితప్పించారు.?ప్రేమ కొందరికే ఎలాంటి సార్టెక్స్ యంత్రాలు లేకపోయినా, అధికారుల అండదండలు ఉన్న కొందరు మిల్లర్లకు నిబంధనల నుంచి మినహాయింపునిచ్చి భారీగా ధాన్యం కేటాయించారు.మిగతావారిపై కక్ష సాధింపు చేపట్టి ప్రభుత్వం నుంచి ఎలాంటి బకాయిలు లేకపోయినా, ఎలాంటి వివాదాలు లేకుండా సక్రమంగా నిర్వహించే మరికొందరు మిల్లర్లకు మాత్రం “సార్టెక్స్ లేదు” అనే సాకు చూపి ధాన్యం కేటాయించకుండా తీవ్ర వివక్ష చూపారు.

జమ్మికుంట మిల్లర్స్ అసోసియేషన్ నాయకులతో కుమ్మక్కు!

జమ్మికుంటలో కొంతమంది రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులుగా చెలామణి అవుతూ, అధికారులను తమ గుప్పట్లో పెట్టుకున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఆ నాయకులు చెప్పినట్లే అధికారులు నడుచుకుంటూ, మిగతా మిల్లులు నడవకుండా అడ్డుపడుతున్నారని బాధిత మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పక్షపాత వైఖరి వల్ల కొందరు మిల్లర్లు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు.

విజిలెన్స్ విచారణ ఏమైంది?


గతంలో ఈ అక్రమాలపై సివిల్ సప్లై డిపార్ట్‌మెంట్ టాస్క్ ఫోర్స్ మరియు విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి పరిశీలనలు జరిపినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఉన్నతాధికారుల మౌనం వెనుక ఉన్న రహస్యమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

బాధిత మిల్లర్ల డిమాండ్:

రాబోయే నూతన సీజన్‌కు సంబంధించి జమ్మికుంటలోని ప్రతి రైస్ మిల్లుపై నిష్పాక్షిక విచారణ జరపాలని బాధిత మిల్లర్లు డిమాండ్ చేస్తున్నారు.?విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారఎ జమ్మికుంటలో సీఎంఆర్ లో పాల్గొనే ప్రతి మిల్లును విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలి.?సార్టెక్స్ పరిశీలన: ఏ ఏ మిల్లుల్లో అసలైన సార్టెక్స్ మెషినరీ ఉందో, ఏ మిల్లుల్లో లేదో పారదర్శకంగా విచారణ జరిపిన తర్వాతే ధాన్యం కేటాయింపులు చేపట్టాలి. నిబంధనలు ఉల్లంఘించి అక్రమ కేటాయింపులు చేసిన అధికారులపై, వారికి సహకరించిన మిల్లర్లపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.?అధికారులు ఇప్పటికైనా తమ పక్షపాత వైఖరిని వీడి, అందరి మిల్లర్లకు సమాన న్యాయం చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

తప్పుడు ఆఫిడవిట్ తో తల్లి ఆస్తి కాజేసిన తనయుడు

సహకరించిన ఎల్కతుర్తి తాసిల్దార్ కార్యాలయం



తెలంగాణ ప్రభుత్వం
తహసీల్దార్ & జాయింట్ సబ్ రిజిస్ట్రార్, Elkathurthi
స్లాట్ బుకింగ్ & సలహా
తేదీ 14/09/2021
సమయం 10:30 AM
తహసీల్దార్ & జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వరుసగా
MRO Office - Elkathurthi
"వారసత్వం కోసం తీసుకెళ్లవలసిన పత్రములు జాబితా"
a. మరణించిన వ్యక్తి యొక్క పిపిబి
b. చట్టపరమైన వారసుల యొక్క పిపిబి (అందుబాటులో ఉంటే)
c. ఓటరిగల్ ఇ-సలాన్
d. క్రింద వారి యొక్క ఆధార్ :
i. చట్టపరమైన వారసులు
e. మరణించిన వ్యక్తుల మరణ ధృవీకరణ పత్రాలు
f. అందరు చట్టపరమైన వారసుల ఉమ్మడి ఒప్పందం
తహసీల్దార్ & జాయింట్ సబ్ రిజిస్ట్రార్, Elkathurthi

హనుమకొండ జోర్దార్ ప్రతినిధి

జోర్దార్ దినపత్రిక “మాయమైపోతున్న మానవ సంబంధాలు” శీర్షికన అక్టోబర్ 26వ తేదీన ఒక వార్త కథనాన్ని ప్రచురించింది. తల్లిదండ్రులను పోషించని, గౌరవించని కుమారుడు రెవెన్యూ యంత్రాంగం సహకారంతో ఆస్తిని కాజేసిన వైనంపై ప్రచురించిన ఈ వార్తకు మరిన్ని ఆధారాలు లభించాయి.

పెద్ద కుమారుడి మాయోపాయం

ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన వీరస్వామి-కొమరమ్మ దంపతులకు ఏడుగురు సంతానం కాగా పెద్ద కుమారుడు పండుగ వెంకటేశ్వర్లు తల్లిదండ్రుల పోషణ భారాన్ని మరిచి వారి మరణానంతరం ఆస్తికోసం కుట్ర చేశారు. తండ్రి వీరస్వామి మార్చి 2016 మరియు తల్లి కొమరమ్మ ఏప్రిల్ 2021 లో మరణించగా మిగతా కుటుంబ సభ్యులందరినీ తోసిరాజని పెద్ద కుమారుడు వెంకటేశ్వర్లు తాను ఒక్కడినే వారసుడినని తప్పుడు ఆఫిడవిట్ సృష్టించి ఎల్కతుర్తి తాసిల్దార్ కార్యాలయం సహకారంతో తల్లి ఆస్తిని కొట్టేశారు. దివంగత కొమరమ్మకు ఖాతా సంఖ్య: 1706 , పట్టేదారు పాసుబుక్కు సంఖ్య : టీ 21030040919 ద్వారా వివిధ సర్వే నంబర్లలో వ్యవసాయ భూమి ఉంది. తల్లి జీవించి ఉండగా ఏనాడు


Government of Telangana
Tahsildar & Jt. Sub Registrar Office, Elkathurthi
Succession - Joint Agreement to be filed by Family Members
Sri/Srimathi/Kumari పండుగ కొమరమ్మ S/o. D/o. W/o వీరస్వామి holder of PPB No.T21030040919 of village Damera mandal Elkathurthi died on dt: 2021. A copy of death certificate (No. 22046) of the deceased has been uploaded.
We hereby declare that the particulars mentioned above are true and correct. None of the successors of the deceased have been overlooked. We shall jointly and severally be liable to civil and criminal action in case the above declaration is found to be false.
Name of Village : Damera
Name of Mandal : Elkathurthi

S. No	Name	Father's / Husband's Name	Relationship with current pattadar	Survey/Sub-Division No./Extent (Ac. Gts)			Total Extent (Ac. Gts)
				431/a	431/c2	434/1	
1	పండుగ వెంకటేశ్వర్లు	వీరస్వామి	SON	0.3500	0.2400	2.1000	3.2900
Total				0.3500	0.2400	2.1000	3.2900

We hereby declare that the particulars mentioned above are true and correct and none of the persons having stake/ interest in the properties mentioned above have been overlooked. We shall jointly and severally be liable to civil and criminal action in case the above declaration found to be false.
Names of applicants
Signature
Name of Witnesses
Signature
Place : Damera
Date 07/09/2021


పట్టించుకోని వెంకటేశ్వర్లు ఆమె మరణానంతరం, ఆమెకు చెందిన సర్వే నంబర్ 431, 434 లోని 3 ఎకరాల 29 గుంటల వ్యవసాయ భూములను తప్పుడు పద్ధతిలో వారసత్వంగా పొందారు.

అవినీతికి కేరాఫ్ గా ఎల్కతుర్తి తాసిల్దార్ కార్యాలయం

తల్లి కొమరమ్మ మరణానంతరం పెద్ద కుమారుడు వెంకటేశ్వర్లు తాను ఒక్కడినే వారసుడిగా పేర్కొంటూ తాసిల్దార్ కు అఫిడవిట్ సమర్పించారు. నిజానికి కొమరమ్మకు ఏడుగురు సంతానం. ముగ్గురు కుమారులు నలుగురు కుమార్తెలలో ఒక కుమార్తె మరణించగా మిగతా వారంతా జీవించి ఉన్నారు. అమ్మాయ్యాలు చేతులు మారిన కారణంగా తాసిల్దార్ కార్యాలయం, వెంకటేశ్వర్లు సమర్పించిన తప్పుడు అఫిడవిట్ పై ఎలాంటి విచారణ చేయలేదు. విరాసత్ పట్టా పొందడానికి అవసరమైన ఫ్యామిలీ మెంబర్స్ లేదా లీగల్ హేర్ సర్టిఫికెట్లను ఆయన సమర్పించలేదు. కనీసం తల్లి పట్టాదార్ పాస్ పుస్తకాన్ని సైతం సమర్పించకుండానే తాసిల్దార్ కార్యాలయం సెప్టెంబర్ 2021 లో వెంకటేశ్వర్లు పేరిట 3 ఎకరాల 29 గుంటల భూమికి వారసత్వ పట్టా జారీ చేసింది. వెంకటేశ్వర్లు ప్రలోభానికి లొంగిన తాసిల్దార్ కార్యాలయం కోర్టు కేసును సైతం విస్మరించింది.

హుజురాబాద్ న్యాయస్థానంలో సివిల్ దావా

పండుగ వెంకటేశ్వర్లు ఆస్తిలో వాటా కోరుతూ తల్లి మరియు


एक सौ रुपये
Rs. 100
रु. 100
ONE HUNDRED RUPEES
भारत INDIA
INDIA NON JUDICIAL
తెలంగాణ TELANGANA
M. PULLESHWAR
LICENCED STAMP VENDOR
L.No. 2004-08-1987
RL.No. 2004-01-2020
Dist. KARIMNAGAR. Cell: 9030400
BEFORE THE OFFICE OF THE HON'BLE CONCERNED AUTHORITIES
AFFIDAVIT
I, Pandiga Venkateshwarlu, S/o.late. Veera Swamy, Aged about :62 yrs R/o. Damera Village of Elkathurthy Mandal in Hanumakonda District,do hereby state on oath as under:-
1. I state on oath that I am the Legalheir, Son and successor of my late mother namely: Pandiga Komuramma, she was died on: 29-04-2021.
2. I state on oath that during the life time of my late mother she the absolute owner and exclusive Possessor of the land in Sy.Nos., 431/c2, area : 0-24 gts, Sy.No. 431/A, 0-35 gts, 434/1 , area: 2-10 gts, situated at Damera Village Shivar of Elkathurthy Mandal in Hanumakonda district.
3. I stateon oath that in our family settlement the supra mentioned land is fell into my share.
4. I submit that I am the legalheir, Son and successor of my late mother namely: Pandiga Komuramma.
5. I submit that if any problems, litigations arises infuture within to said matter,I will be held responsible for all
..2..Page...
//Attested//

ఇద్దరు సోదరులను ప్రతివాదులుగా పేర్కొంటూ హుజురాబాద్ న్యాయస్థానంలో ఓఎస్ నంబర్ 61/2019 ద్వారా కేసు వేశారు. అనంతరం ఈ కేసు హనుమకొండ న్యాయస్థానంలో ఓఎస్ 1175 / 2022 ద్వారా కొనసాగుతూ ఉండగా, ఈ వివరాలన్నింటినీ దాచిపెట్టి తప్పుడు అఫిడవిట్ సమర్పించి ఎల్కతుర్తి తాసిల్దార్ కార్యాలయం వారి సౌజన్యంతో విరాసత్ పట్టా పొందారు. అవినీతి పొరలు కమ్మిన తాసిల్దార్ కార్యాలయానికి సివిల్ కేసు సైతం కానరాకుండా పోయింది. వారసత్వ పట్టా ప్రక్రియలో పాటించాల్సిన కనీస విచారణ సైతం కార్యాలయం చేయకపోవడం విస్మయం గొలుపుతుంది.

కుటుంబ సభ్యుల ఆందోళన

కుటుంబ సభ్యుల ఆమోదం లేకుండా రహస్యంగా పెద్ద కుమారుడు వెంకటేశ్వర్లు, తల్లి ఆస్తిలో 3 ఎకరాల 29 గుంటలకు వారసత్వ పట్టా పొందిన విషయం తెలుసుకున్న పండుగ చంద్రశేఖర్ ఈ అక్రమంపై ఫిర్యాదు చేశారు. కొమరమ్మ మరో కుమారుడు చంద్రశేఖర్ ఫిర్యాదుల పర్వం ఫిబ్రవరి 2022 నుండి ప్రారంభమై నేటికీ కొనసాగుతోంది. సంపూర్ణ న్యాయం దక్కక కుటుంబ సభ్యులు కొట్టుమిట్టాడు తున్నారు.

(ఎఫ్ ఐ ఆర్ నమోదు.... న్యాయస్థానం విచారణ... రేపటి సంచికలో)

శుభోదయం

మనం ఆస్తిని కలిగి ఉండాలి!. కానీ,
ఆస్తి మనల్ని కలిగి ఉండకూడదు!.

రెండు జీవులు, పట్టు పురుగు, తేనెటీగ,
ఈ రెండూ ప్రకృతిపై ఆధారపడి జీవిస్తాయి.
రెండూ శ్రమిస్తాయి.
రెండూ తమకు అవసరమైన
పదార్థాలను తయారుచేసుకుంటాయి!.

అయితే, వాటి జీవన విధానాలను,
మనిషి జీవితానికి అన్వయించి పరిశీలిస్తే,
రెండు విభిన్నమైన...
ఆధ్యాత్మిక సందేశాలు కనిపిస్తాయి!.

ఒకటి బంధనానికి ప్రతీకగా నిలుస్తుంది.
మరొకటి కర్మయోగానికి ప్రతీకగా కనిపిస్తుంది.
పట్టుపురుగు ఆకులను ఆహారంగా తీసుకుని,
తన శరీరంలో పట్టు దారాన్ని తయారుచేస్తుంది.
ఆ దారాన్ని తన చుట్టూ అల్లుకుంటూ,
ఒక గూడును నిర్మించుకుంటుంది.
ఆ దారాల గూడులో...
తానే చిక్కుకున్నట్లు కనిపిస్తుంది!.
తాను తయారుచేసిన పట్టును,
అది ఆహారంగా వినియోగించుకోదు!.
అయితే, పట్టు ఉత్పత్తి కోసం పెంచే,
పట్టు పురుగులను సాధారణంగా,
గూడు నుంచి బయటకు రాకముందే చంపి,
వాటి గూళ్ల నుంచి పట్టు దారాన్ని సేకరిస్తారు!.

ఈ దృశ్యాన్ని మనిషి జీవితానికి,
అన్వయించి చూస్తే, ఒక లోతైన...
ఆధ్యాత్మిక సందేశం కనిపిస్తుంది!.
పట్టుపురుగు తాను తయారుచేసిన,
గూడులో చిక్కుకున్నట్లే, మనిషి కూడా,
తాను సంపాదించిన వాటిపై పెంచుకున్న,
మమకారంలో చిక్కుకుంటాడు!.
మనిషి పట్టుపురుగులాగే...
తన జీవితమంతా ఏదో ఒకటి,
సంపాదించడానికి శ్రమిస్తుంటాడు!.

బాల్యంలో బొమ్మల కోసం, యవ్వనంలో,
విద్య, ఉద్యోగం, గుర్తింపు కోసం, మధ్యవ
యస్సులో,ఇల్లు, ఆస్తి, సంపద, పదవి కోసం,
వృద్ధాప్యంలో తాను సంపాదించిన వాటిని,
కాపాడుకోవడం కోసం తపిస్తుంటాడు!.
అవసరాల కోసం ప్రారంభమైన సంపాదన,
మమకారంతో కూడిన బంధనంగా మారుతుంది!.

ఇలా సంపాదించిన ప్రతి వస్తువు,
ప్రతి గుర్తింపు, ప్రతి అనుబంధం,
అతని చుట్టూ ఒక విధమైన
మమకారపు గూడును నిర్మిస్తాయి!.
ఆ ప్రపంచాన్ని తానే నిర్మించుకున్నప్పటికీ,
చివరకు దాని నుంచి బయటపడలేని,
స్థితికి చేరుకుంటాడు!.
ఇక్కడ సంపాదించిన సంపద,
సమస్య కాదు. సంపదపై ఏర్పడిన,
మమకారమే అసలు సమస్య!.

తేనెటీగ పుష్పాల నుంచి,
మకరందాన్ని సేకరిస్తుంది!.
ఆ మకరందాన్ని తేనెగా మారుస్తుంది.
తేనెను తుట్టెలో నిల్వ చేస్తుంది!.

తేనెటీగలు తాము తయారుచేసిన,
తేనెను ఆహారంగా కూడా,
వినియోగించుకుంటాయి!.
తేనె వాటికి శక్తినిచ్చే ఆహారం.
ముఖ్యంగా పుష్పాలు లభించని కాలంలో,
నిల్వ చేసిన తేనె వాటి జీవనానికి,
ఉపయోగపడుతుంది!.
అయితే, తేనెటీగ తుట్టెను,
పట్టుపురుగు గూడుతో పోల్చినప్పుడు,
ఒక ఆసక్తికరమైన తేడా కనిపిస్తుంది!.

పట్టుపురుగు తన చుట్టూ,
పట్టు గూడును అల్లుకుని,
కొంతకాలం అందులోనే ఉండిపోతుంది.
కానీ, తేనెటీగ మాత్రం తాను నిర్మించుకున్న,
తుట్టెలోకి ప్రవేశించగలదు, బయటకు రాగలదు.

తేనెటీగ తన తుట్టెను రక్షించుకుంటుంది.
అయితే, తుట్టె దాని జీవనానికి,
ఉపయోగపడే నిలయం మాత్రమే;
బయటకు రాలేని బంధనం కాదు!.

పట్టుపురుగు గూడు మమకారానికి,
ప్రతీక అయితే, తేనెటీగ తుట్టె,
వివేకంతో కూడిన కర్మకు ప్రతీక!.

పట్టుపురుగు మనకు...
బంధనాన్ని గుర్తుచేస్తుంది!.
తేనెటీగ మనకు శ్రమ, సహకారం,
స్వేచ్ఛల మధ్య ఉండవలసిన...
సమతుల్యతను గుర్తుచేస్తుంది!.

అలాగే మనిషి కూడా సంపాదించాలి!.
కానీ, సంపాదన మనిషికి బంధనం కాకూడదు!.

తెలంగాణ హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరమ్‌కు వరంగల్ డిస్ట్రిక్ట్ ఉమెన్స్ వింగ్ ప్రెసిడెంట్‌గా కుచన నాగ జ్యోతి ఎంపిక



హన్మకొండ జోర్దార్ ప్రతినిధి:తెలంగాణ రాష్ట్రాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్న తెలంగాణ హ్యూమన్ రైట్ జస్టిస్ ఫోరమ్ వరంగల్ డిస్ట్రిక్ట్ ఉమెన్స్ వింగ్ ప్రెసిడెంట్‌గా కుచన నాగ జ్యోతి ని నియమించినట్టు సంస్థ ఛైర్పర్సన్ ణతీ. వ్యాసభట్ శ్రీవాణి ఒక ప్రకటనలో తెలిపారు.
ఈ మేరకు కుచన నాగ జ్యోతి సంస్థలో వరంగల్ డిస్ట్రిక్ట్ ఉమెన్స్ వింగ్ ప్రెసిడెంట్ గా నియమించడంపై స్పందించిన వారు పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ --
" మా మీద నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ఛైర్పర్సన్ ణతీ. వ్యాసభట్ శ్రీవాణి గారికి , మా నియామకానికి కృషి చేసిన ణతీ. సత్యనారాయణ దేవరకొండ (సతీష్)గారికి, వర్కింగ్ ప్రెసిడెంట్ తెలంగాణ. కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మానవ హక్కుల పరిరక్షణ కోసం మా శక్తి మేరకు పనిచేస్తాం. బాధితులకు అండగా నిలిచి, న్యాయం జరిగేలా నిరంతరం కృషి చేస్తాం," అని తెలిపారు.
"సంస్థ అభివృద్ధికి సద్వ్యవస్థాపకతతో పనిచేస్తాం. హక్కులు భంగమవుతున్న ప్రతిసారి తెలంగాణ హ్యూమన్ రైట్ జస్టిస్ ఫోరమ్ తరఫున గట్టిగా స్పందిస్తాం. మా నియామకం సామాజిక బాధ్యతను మరింత పెంచినట్లుంది," అని వారు అన్నారు.ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు, స్థానిక ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు నూతనంగా నియమితులైన ఉమెన్స్ వింగ్ ప్రెసిడెంట్ కు శుభాకాంక్షలు తెలియజేశారు..

ఎల్‌నినో ప్రభావం..

ఎండల తీవ్రతపై విద్యార్థులకు అవగాహన

- తల్లిదండ్రులకు చైతన్య లేఖలు రాసిన ఆర్బిట్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు



హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ శివారులోని ఆర్బిట్ ఇ-టెక్నో స్కూల్‌లో ఎల్‌నినో ప్రభావం, పెరుగుతున్న ఎండల తీవ్రతపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక ఉష్ణోగ్రతల వల్ల మానవులు, జంతువులు,పంటలకు కలిగే నష్టాలు,వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉపాధ్యాయులు వివరించారు.అనంతరం విద్యార్థులు తల్లిదండ్రులకు చైతన్య లేఖలు రాశారు. నీటిని పొదుపుగా వినియోగించడం,వర్షపు నీటిని ఒడిసిపట్టడం, విద్యుత్ ఆదా చేయడం, బయటకు వెళ్లేటప్పుడు గొడుగు,టోపీ,మంచినీరు వెంట ఉంచుకోవడం వంటి సూచనలు చేశారు.అలాగే మజ్జిగ,కొబ్బరినీళ్లు తీసుకోవాలని,తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయాలని,మల్చింగ్ పద్ధతులు పాటించాలని కోరారు.విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పాఠశాల ప్రిన్సిపల్,కరస్పాండెంట్ సీహెచ్. భగవాన్ రెడ్డి తెలిపారు. విద్యార్థులు రాసిన లేఖలు తల్లిదండ్రుల్లో చైతన్యం కలిగించడం అభినందనీయమని పాఠశాల డైరెక్టర్ హారిక భగవాన్ రెడ్డి పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో అకాడమిక్ ఇన్‌చార్జ్ వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయులు,సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే ప్రకటించి 50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలి

- ఈహెచ్ఎస్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలి
- పెన్షనర్ల బకాయిలు ఏకమొత్తంగా చెల్లించాలి



హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, హుజూరాబాద్ శాఖ అధ్యక్షుడు భారత ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి చీకట్ల సమ్మయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీకి ఇచ్చిన హామీ మేరకు సెప్టెంబర్ 2026 నాటికి పీఆర్సీ నివేదిక తెప్పించి నూతన వేతన సవరణ ప్రకటించాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు నివేదిక కూడా తెప్పించకపోవడం విచారకరమన్నారు. వెంటనే పీఆర్సీ నివేదికను తెప్పించి కనీసం 50 శాతం ఫిట్‌మెంట్‌తో జూలై 2023 నుంచి అమలు చేయాలని కోరారు.అలాగే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల నుంచి ఈహెచ్ఎస్ కోసం 1.5 శాతం కాంట్రిబ్యూషన్ వసూలు చేస్తున్నప్పటికీ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈహెచ్ఎస్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.పదవీ విరమణ పొందిన పెన్షనర్లకు రావాల్సిన పెండింగ్ బకాయిలను ఏకమొత్తంగా మంజూరు చేయాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలన్నింటినీ ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

కాలుష్య రహిత పర్యావరణం కోసం

హరిత దీపావళి జరుపుకోవాలి

- సుజాత విద్యానికేతన్ హైస్కూల్‌లో పర్యావరణ మిత్ర ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



హసన్ పర్తి,జోర్దార్ ప్రతినిధి:కాలుష్య రహిత పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సుజాత విద్యానికేతన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారామ్ కర్ణ పిలుపునిచ్చారు.66వ డివిజన్ పరిధిలోని సుజాత విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో పర్యావరణ మిత్ర ఎన్జీసీ యూనిట్ ఆధ్వర్యంలో హరిత దీపావళి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చెట్ల నరికివేత, ప్లాస్టిక్ వినియోగం,వాయు కాలుష్యం కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు.బాణసంచా కాల్చడం వల్ల వెలువడే విషపూరిత రసాయనాలు, అధిక శబ్దాలు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, శ్వాసకోశ సమస్యలతో పాటు జంతువులు, పక్షులకు కూడా ఇబ్బందులు కలుగుతాయని వివరించారు.దీపావళి పండుగను సంప్రదాయబద్ధంగా దీపాలు వెలిగిస్తూ,ప్రమాదకరమైన బాణసంచాకు దూరంగా ఉండి కాలుష్య రహితంగా జరుపుకోవాలని విద్యార్థులకు సూచించి,ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో హరిత దీపావళి ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు జూపాక నాగరాజు,ఏ. వెంకట్, రాధాకుమారి,సబిహా బేగం, మానస, అరుణ,సంధ్య, సుచిత్ర,ప్రవళిక,గీత, సరిత,స్వప్న, దివ్య, దేవికారాణి,స్వాతి, వెంకటేశ్వర్లు,ప్రవీణ్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై తనిఖీలు

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు
- ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రజిత



హనుమకొండ,జోర్దార్ ప్రతినిధి:హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ఆదేశాల మేరకు ప్రోగ్రామ్ ఆఫీసర్ (ఎంసీహెచ్) డాక్టర్ రజిత హనుమకొండ పట్టణంలోని స్కానింగ్ కేంద్రాలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీపీఎన్‌డీటీ చట్టం అమలు తీరును పరిశీలించి, రికార్డులు, రిజిస్టర్లు, ఫారమ్ ఎఫ్, అనుమతి పత్రాలను తనిఖీ చేశారు.ప్రతి స్కానింగ్ కేంద్రం తప్పనిసరిగా చట్ట నిబంధనలు పాటించాలని, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, లింగ వివరాలు వెల్లడించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఫారమ్ ఎఫ్ వివరాలను ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని, చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్‌తోనే కేంద్రాలు నిర్వహించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆడపిల్లల జనన నిష్పత్తిని కాపాడటం, లింగ వివక్షను నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పంచాయతీలు నిర్వహిస్తే కఠిన చర్యలు

- డిపాజిట్ల పేరుతో డబ్బులు వసూలు చేసినా, జరిమానాలు విధించినా కేసులు నమోదు చేస్తాం
- ఎస్ఐ హెచ్చరిక



చెన్నారావుపేట,జోర్దార్ ప్రతినిధి:గ్రామాల్లో పంచాయతీల పేరుతో కొందరు పెద్దమనుషులు ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయడం, అక్రమంగా జరిమానాలు విధించడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చిందని ఎస్ఐ తెలిపారు. ఇటువంటి చర్యలు చట్టవిరుద్ధమని, ఎవరికీ కోర్టుల మాదిరిగా తీర్పులు ఇచ్చే అధికారం లేదని స్పష్టం చేశారు. డబ్బుల కోసం బెదిరింపులు, అక్రమ వసూళ్లు, దాడులకు పాల్పడితే సంబంధిత బీఎన్ఎస్ సెక్షన్ల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధితులు వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ సూచించారు.

ఆటో డ్రైవర్‌పై హత్యాయత్నం

- పాత భూ వివాదాలే కారణం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఇన్‌స్పెక్టర్

హసన్‌పర్తి,(జోర్దార్ ప్రతినిధి ప్రతినిధి)హసన్‌పర్తి మండలం సీతంపేట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గిన్నారపు రవీందర్ (52)పై పాత భూ వివాదాల నేపథ్యంలో హత్యాయత్నం జరిగినట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం..నవంబర్ 5వ తేదీ సాయంత్రం ఆటోను అద్దెకు మాట్లాడుకున్న వ్యక్తి బాలాజీ మిల్లు వద్దకు తీసుకెళ్లి,అక్కడి నుంచి రింగ్ రోడ్డు బ్రిడ్జి వైపునకు తీసుకెళ్లాలని కోరాడు. ఏల్లాపూర్--ఎన్‌హెచ్ రహదారిలోని రైల్వే గేటు సమీపానికి చేరుకోగానే, అక్కడ వేచి ఉన్న తన స్నేహితులతో కలిసి రవీందర్‌పై దాడికి పాల్పడ్డారు.రాళ్ల దాడిలో తల,నడుము,కంటి భాగాలకు గాయాల య్యాయి. నిందితులు రైల్వే ట్రాక్‌పై పడేయాలని ప్రయత్నించగా,
వారి నుంచి తప్పించుకుని పొలాల్లోకి పారి పోయి ప్రాణాలు కాపాడుకున్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.
భూ వివాదం న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉందని,ఈ నేపథ్యంలో తనపై దాడి జరిగిందని రవీందర్ ఆరోపించారు.
తనకు,తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొ న్నాడు.ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహే ందర్ తెలిపారు.

కాండపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ



- రికార్డులు,మందుల నిల్వల పరిశీలన
- జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష

హనుమకొండ,జోర్దార్ ప్రతినిధి:హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య కొండపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించడంతో పాటు ఫార్మసీ స్టోర్‌లో మందుల నిల్వలు,పంపిణీ రికార్డులను తనిఖీ చేశారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని,రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.అనంతరం మాతా శిశు ఆరోగ్యం, సాధారణ టీకాలు,హెచ్‌పీవీ వ్యాక్సినేషన్,ఎన్‌సీడీ, టీబీ ముక్త్ భారత్,హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణ వంటి జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును సమీక్షించారు.ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారి, సిబ్బందిని ఆదేశించారు.

దండోరా వేడుకల్లో మనసుపడ్డ వారితో పెండ్లి



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ఆదిలాబాద్‌లో దండోరా వేడుకల్లో పూర్వీకుల సంప్రదాయం కొనసాగుతోంది. దండోరా వేడుకలకు ఇతర గ్రామాలకు వెళ్లిన వారికి భోజనం ఏర్పాటు చేసి వీడ్కోలు పలుకుతారు. భోజనాల తర్వాత ఇరు గ్రామాల వారు పరిచయం పెంచుకుంటారు. పెళ్లికాని మ గవారు, మహిళలు ఎవరైనా ఒకరిపై ఒకరు మ నసు పడితే పెద్దలతో చెప్పి సంబంధం కుదు ర్చుకోవడం తరతరాలుగా వస్తున్న ఆచారం.
శుక్రవారం ఇచ్చోడ మండలం పెద్ద బాదిగూడ వాసులు ఉత్సవాలు చేసుకున్నారు.

నీటి కుంటలో యువకుడి మృతదేహం లభ్యం



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:
ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కజ్జర్ల గ్రామ శివారులోని నీటి కుంటలో యువకుడి మృతదేహం లభ్యమైంది.
పోలీసుల వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌లోని శంకర్‌గుట్టకు చెందిన సాయి కుమార్ ఈ నెల 5న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం కజ్జర్ల గ్రామ శివారులోని కుంటలో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి ఆశన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తలమడుగు ఎస్సై రాధిక తెలిపారు.

తుఫాను నష్టాలను పరిశీలించిన
ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



- బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు
- నెమలిపేట ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

భద్రాద్రి కొత్తగూడెం,జోర్దార్ ప్రతినిధి:మురసు తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాలను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దమ్మపేట మండలంలో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నెమలిపేట, పార్కలగండి,కొత్తూరు, పట్వారిగూడెం, దిబ్బగూడెం,జగ్గారం, అంకంపాలెం గ్రామాల్లో తెగిపోయిన రహదారులు, చెరువులు,వాగులు, నీటమునిగిన పంట పొలాలను పరిశీలించారు.

దెబ్బతిన్న రహదారుల వద్ద తక్షణమే డైవర్షన్ రోడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పంట,ఆస్తి నష్టాలను అంచనా వేసి బాధితులకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నెమలిపేట గ్రామానికి వరద ముప్పు లేకుండా రెండు వైపులా కాలువలకు కాంక్రీట్ గోడలు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. గ్రామంలో డ్రైనేజీ నిర్మాణానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ఈ పర్యటనలో ప్రజాప్రతినిధులు,మండల అధికారులు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హుజురాబాద్ అభివృద్ధికి 15 కోట్ల నిధులు

- ప్రధాన చౌరస్తాల సుందరీకరణ పనులకు శ్రీకారం
- నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్

హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:హుజూరాబాద్ పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులు చేపడుతున్నామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ తెలిపారు. పట్టణ అభివృద్ధికి రూ. 15 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు వెల్లడించారు.శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని ప్రధాన చౌరస్తా అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొట్టి ఆయన శ్రీకారం చుట్టారు. మున్సిపల్ పరిధిలో రూ. 1.50 కోట్లతో నాలుగు ప్రధాన కూడళ్లను సుందరీకరించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రూ. 4.5 కోట్లతో సీసీ రోడ్లు, రూ. 2.5 కోట్లతో డ్రైనేజీ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. చిన్నారుల కోసం చిల్డ్రన్ పార్క్, గ్రామాల్లో ఐమాక్స్ లైట్లు, తాగునీటి అవసరాల కోసం రూ. 58 లక్షలతో బోర్లు మంజూరు చేయించినట్లు వివరించారు.



ఇందిరమ్మ ఇంట్లో దీపావళి

పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ప్రయోజనకరంగా మారిందని ప్రణవ్ అన్నారు. పీసీసీ ఆదేశాల మేరకు హుజురాబాద్ మండలం ధర్మరాజుపల్లిలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులతో కలిసి దీపావళి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లు మంజూరు కాగా, 2,21,500 ఇళ్లు పూర్తయ్యాయని, హుజురాబాద్ నియోజకవర్గంలో 5,500 ఇళ్లు మంజూరై 2,500కు పైగా పూర్తయ్యాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, వైస్ చైర్‌పర్సన్ అంజలి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిజ్ఞాస విజేతలకు చెక్కుల పంపిణీ

ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:రాష్ట్రస్థాయి బిజ్ఞాస పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కాలేజ్‌లో బహుమతి ప్రదానోత్సవం చేశారు. కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించిన ఐదు బృందాలు కార్యక్రమంలో పాల్గొన్నాయి. కలెక్టర్ విజేతలకు చెక్కులు అందజేసారు.



వ్యాసరచన పోటీలలో మెరిసిన
కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



జోర్దార్ ప్రతినిధి -వరంగల్:ప్రతిష్టాత్మక 'టాటా గ్రూప్' సంస్థలు జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని బహుమతులు సాధించారు. సమాజ శ్రేయస్సు, వివిధ సమకాలీన అంశాలపై నిర్వహించిన ఈ పోటీలలో పాఠశాల విద్యార్థులు విశేషమైన ఆలోచనా సృజనాత్మకతతో వ్యాసాలు రాసి న్యాయ నిర్ణేతల ప్రశంసలు అందుకున్నారు.

ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రధానోపాధ్యాయులు మాధవి విజేతలైన విద్యార్థులను , గైడ్ టీచర్ పోగు అశోక్‌ను ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా హెడ్మాస్టర్ మాట్లాడుతూ "టాటా గ్రూప్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ నిర్వహించిన పోటీలలో మన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు బహుమతులు గెలుచుకోవడం ఎంతో గర్వకారణం. విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలను, సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయి.

విజేతలైన విద్యార్థులు ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.

భవిష్యత్తులో కూడా విద్యార్థులు ఇలాంటి అనేక పోటీలలో ఉత్సాహంగా పాల్గొని పాఠశాలకు, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి" అని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు రమేశ్, కరుణ కుమారి, పావని, విద్యార్థులు పాల్గొని విజేతలను అభినందించారు.

అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలి



- అమర్లపూడి రాము

కొత్తగూడెం,జోర్దార్ ప్రతినిధి:అమరవీరుల త్యాగాలను, ఆశయాలను స్మరిస్తూ సమసమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అమర్లపూడి రాము పిలుపునిచ్చారు.రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నవంబర్ 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా లింగంపల్లి, జమేదారు బంజర్ గ్రామాల్లో సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ భూమి, భుక్తి, పేదల రాజ్యం కోసం పోరాడి ప్రాణాలర్పించిన అమరవీరుల ఆశయాలను కొనసాగించాలని అన్నారు. నేటి సమాజంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, ధరల పెరుగుదలపై ప్రజలు, యువత ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఊకే అప్పారావు, మండల నాయకులు లింగాల కాక రమేష్, వాడే గిరి, సోయం సీతారాములు, సున్నం నారాయణ, రవి, తామ రాముడు, కుంజా పాపారావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆఫీస్ ముందు
చెత్త వేసి కౌన్సిలర్ నిరసన

ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ఆదిలాబాద్ మున్సిపల్ ఆఫీస్ ఎదుట కౌన్సిలర్ జీషాన్ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. 8 రోజులుగా తన వార్డులో డోర్-టు-డోర్ చెత్త సేకరణ వాహనాలు రాక పోవడంతో అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఆయన ఈ ఆందోళన చేపట్టారు. వార్డులో చెత్త బండ్లు తిరగకపోవడంతో ఇళ్ల మధ్య చెత్త పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సమస్య చెప్తే అధికారులు ఒకరిపై ఒకరు బాధ్యత నెట్టేసుకుంటున్నారని మండిపడ్డారు.



గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించాలి



- కలెక్టర్ సత్య శారద

వరంగల్,జోర్దార్ ప్రతినిధి:గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.జిల్లా నీటి సరఫరా, పారిశుధ్య మిషన్ కమిటీ సమావేశంలో మిషన్ భగీరథ పనులు, నీటి నాణ్యత పరీక్షలు, పారిశుధ్య నిర్వహణపై సమీక్షించారు. నవంబర్ 11న మండలాల వారీగా గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షలు నిర్వహించి, నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు.

నీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, నీటి నాణ్యతను పరీక్షిస్తూ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, డీఎంహెచ్ఓ రాజిరెడ్డి, జడ్పీ సీఈఓ వసంత,ఆత్మ పీడీ విజయ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా
తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

- పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి
- ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్


మొగుళ్లపల్లి,జోర్దార్ ప్రతినిధి:మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్‌తో పాటు చిట్యాల సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు.పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నేరాల నియంత్రణకు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని సూచించారు. ఈ తనిఖీలో చిట్యాల సీఐ సతీష్, మొగుళ్లపల్లి ఎస్సై ముప్పు సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సైన్స్ మీద ఎన్నో పరిశోధనలు చేసిన సి వి రామన్

వస్తువు మీద కాంతి కిరణం పడినప్పుడు అది పరావర్తనం చెందుతుందని.. దానివల్లనే అది తన గమనాన్ని మార్చుకుంటుందని ప్రముఖ వైజ్ఞానిక శాస్త్రవేత్త సీవీ రామన్ వస్తువు మీద కాంతి కిరణం పడినప్పుడు అది పరావర్తనం చెందుతుందని.. దానివల్లనే అది తన గమనాన్ని మార్చుకుంటుందని ప్రముఖ వైజ్ఞానిక శాస్త్రవేత్త సీవీ రామన్ 1928లో సరిగ్గా ఇదే రోజున వెల్లడించారు. ఆయన రామన్ ఎఫెక్ట్‌ను కనిపెట్టిన రోజునే మనం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని (నేషనల్ సైన్స్ డే) జరుపుకుంటున్నాం. సైన్స్ రంగంలో ఎవరూ చేయలేని సాహసాలను అత్యంత సునాయాసంగా చేధించి.. ప్రపంచ వినువీధిలో భారతదేశ పతాకాన్ని రెపరెపలాడించారు. వైజ్ఞానిక రంగంలో ప్రపంచ దేశాలను తలదన్నేలా భారత్‌ను శక్తివంతగా చూపించారు. అరకొర పరికరాలతోనే అబ్బురపరిచే ప్రయోగాలకు నిలువెత్తు వేదికలా నిలిచారు. సముద్రపు నీటి గుండా కాంతి ప్రవహించేటప్పుడు కాంతి పరిక్షేపణం చెంది నీరు నీలి రంగులో కనిపిస్తుందని కూడా లోకానికి వెల్లడించారు.తమిళనాడులోని తిరుచురాపల్లిలో 1888 నవంబర్ 7న చంద్రశేఖర్ అయ్యర్, పార్వతి అమ్మాళ్‌కు చంద్రశేఖర్ వెంకట రామన్ జన్మించారు. తండ్రి విశాఖపట్నంలోని ఏవీఎన్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేయడం వల్ల రామన్ బాల్యం, విద్యాభ్యాసం విశాఖలోనే జరిగింది. రామన్ తన 13 వ ఏట 1902 లో ప్రెసిడెన్సీ కాలేజీలో చేరి.. 1904 లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడై బంగారు పతకం పొందారు. 1907 లో ఇదే కళాశాల నుంచి ఎంఏ డిగ్రీని ఫిజిక్స్‌లో డిస్టింక్షన్లో ఉత్తీర్ణుడయ్యాడు. అనంతరం తల్లిదండ్రుల కోరిక మేరకు ఐసీఎస్ పాసై కలకత్తా ప్రభుత్వ ఆర్థిక శాఖలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ చేరారు.

ఒకసారి కలకత్తాలో ప్రయాణిస్తుండగా బౌబజారు స్ట్రీట్ దగ్గర ఇండియన్ అసోసియేషన్ ఫర్ కల్టివేషన్ ఆఫ్ సైన్స్ అనే బోర్డును చూసిన సీవీ రామన్.. పరుగు పరుగున అక్కడికి వెళ్లి ఆ సంస్థ కార్యదర్శి డాక్టర్ అమృతలాల్ సర్కార్‌ను కలిసారు. తనకు పరిశోధన చేసేందుకు అనుమతినించాలని కోరి సాధించారు. అక్కడి నుంచి ఆయన పరిశోధనా ప్రస్థానం మొదలైంది. వారాంతపు సెలవులు, పండగల సమయాల్లో పరిశోధనలతో కాలం గడిపేవారు. తన జీవిత కాలంలో సగభాగం పరిశోధనలకే కేటాయించారంటే.. రామన్‌కు పరిశోధనలపై ఎంత ప్రేమ దాగి ఉందో అర్థం చేసుకోచ్చు.సీవీ రామన్ కనిపెట్టిన రామన్ ఎఫెక్ట్‌కు 1930లో ఆయనకు నోబెల్ బహుమతిని సాధించిపెట్టింది. నోబెల్ పొందిన రెండో భారతీయుడిగా నిలిచిన రామన్‌ను భారత ప్రభుత్వం ప్రథమ జాతీయ ఆచార్యునిగా నియమించింది. 1928 లో రామన్‌కు సర్ బిరుదు దక్కగా.. 1947 లో ప్రతిష్టాత్మక ఫ్రాంక్లిన్ మెడల్ లభించింది. 1954 లో భారత ప్రభుత్వం 'భారతరత్న'తో సత్కరించింది. 1957లో సోవియట్ యూనియన్ 'లెనిన్ బహుమతి'ని బహూకరించింది. విదేశాలలో ఎన్నో అవకాశాలున్నా కాదని, మన దేశంలోనే అరకొర సదుపాయాలతోనే పరిశోధనలు చేసి సీవీ రామన్ ఎన్నో విజయాలు సాధించిన భవిష్యత్ తరాలకు మార్గదర్శిగా నిలిచారు.మనం కూడా సైన్స్‌లో మరెన్నో ప్రయోగాలు చేద్దాం నూతన విషయాలు కనుగొందాం జై సైన్స్ జై జై సైన్స్



నవంబర్ 7 న సి వి రామన్ జయంతి సందర్భంగా

కామిడి సతీష్ రెడ్డి
స్కూల్ అసిస్టెంట్ బయాలజీ ములుగు పల్లి ఉన్నత పాఠశాల,జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా

వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా
ఎన్నికల ఫలితాలు వస్తాయి

- ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు



చింతూరు,ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో:రేఖపల్లిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మాచర్ల గంగయ్య ఆధ్వర్యంలో మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు నివాసంలో పత్రికా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసిన మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేశారని, వెలువడనున్న ఎన్నికల ఫలితాలు తమ పార్టీకి అనుకూలంగా వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్తులో మంచి రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐపీఈ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ లింబాద్రి
బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్ : ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ హైదరాబాద్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి బాధ్యతలు స్వీకరించారు. ఆయన తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్‌గా, తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా , ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా, హైదరాబాద్‌లోని డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ విద్యా సంస్థల ముఖ్య కార్యనిర్వహణాధికారి వంటి పలు విశిష్ట పదవులను నిర్వహించారు.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కార కమిటీకి అంబుడ్స్‌పర్సన్‌గా పనిచేస్తున్నారు. విస్తృతమైన విద్యా అనుభవం, పరిపాలనా నైపుణ్యం , సంస్థ యొక్క విద్యా నైపుణ్యాన్ని, పరిశోధనా కార్యక్రమాలను , సంస్థాగత అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లడంలో లింబాద్రి సేవలందిస్తారని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ సంస్థ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది

అనారోగ్యంతో బాధపడుతున్న
క్రీడాకారుడికి ఆర్థిక సాయం

- తోటి క్రీడాకారుల ఔదార్యం
- వైద్య ఖర్చుల కోసం అందజేత

హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:
హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన వాలీబాల్ క్రీడాకారుడు మేకల బాలయ్య (బాలు) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న తోటి క్రీడాకారులు మానవత్వంతో ముందుకొచ్చారు.

తమ గురువు,రిటైర్డ్ పీడీ తిరునగిరి నరసింహం ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం సేకరించి శుక్రవారం బాలయ్యకు రూ.55 వేల నగదును అందజేశారు. నరసింహం బాలయ్య ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బాలయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ,ఆయన చిన్న నాటి స్నేహితులు, తోటి క్రీడాకారులు,గ్రామ ప్రజలు కూడా తమవంతు సహాయం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జన్ను ఆరోగ్యం,వల్లాల రమేష్,పెద్దమ్మ నరసింహారాములు, బయ్యా సదానందం, తాళ్లపెల్లి రాముడు, మానుపాటి అంజయ్య, వెలిసోజు బ్రహ్మచారి, మేకల చెన్నయ్య,చాతల్ల సదానందం,మాటేటి కుమారస్వామి,దాడి సుధాకర్,ఉచిత సుధాకర్, ఎలుకరాజు సదానందం, మట్టేడ యుగంధర్, మేకల రవీందర్,నాగమల్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



టీజీపీఎస్సీ పరీక్షలకు పటిష్ట పోలీసు బందోబస్తు!

- పరీక్షా కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్ల పరిశీలన.. అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు
- అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు అదిషనల్ డీసీపీ ఆదేశాలు





రామగిరి జోర్దార్ ప్రతినిధి:టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీ భద్రత మధ్య నిర్వహించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని జేఎన్వీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని అడిషనల్ డీసీపీ (అడ్మినిస్ట్రేషన్) కె. శ్రీనివాస్ సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

భద్రతా ఏర్పాట్లపై ఆరా

పరీక్షా కేంద్రం పరిసరాల్లో పోలీసు బందోబస్తు, భద్రతా సిబ్బంది విధులు, అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

వివిధ ప్రాంతాల నుంచి పరీక్ష రాసేందుకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, పరీక్షా కేంద్రం వద్ద ప్రశాంత వాతావరణం ఉండేలా తగిన బందోబస్తు కొనసాగించాలని సూచించారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ పరిణామాలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

పోలీసు అధికారుల పర్యవేక్షణ

పరీక్షల నిర్వహణలో భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టడం ద్వారా పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఈ తనిఖీలో అడిషనల్ డీసీపీ వెంట మంథని సీఐ బుద్ధె స్వామి, రామగిరి ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింగరేణిలో స్క్రాప్‌పై నిర్లక్ష్యం

మట్టిపాలు చేస్తున్న లక్షల ఆస్తి!

- OCP-1 ఫేస్-1 చెక్‌పోస్ట్ వద్ద మట్టిలో కూరుకుపోయిన డంపర్ బాడీ
- నెలలు గడుస్తున్నా వెలికితీతకు నోచుకోని వైనం.. తుప్పు పడుతున్న విలువైన ఇనుప సామగ్రి
- వేలం వేయాల్సిన స్క్రాప్‌ను మట్టిపాలు చేస్తున్నదెవరు? అధికారుల పర్యవేక్షణ ఏమైనట్లు?



రామగిరి జోర్దార్ ప్రతినిధి:సింగరేణి సంస్థలో కోట్లాది రూపాయల విలువైన యంత్రాలు, పరికరాలు వినియోగంలో ఉండగా.. మరోవైపు పనికిరాని సామగ్రిని సైతం సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి నెలకొందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రామగిరి మండలంలోని సింగరేణి ఓసీపీ-1 ఫేస్-1 చెక్‌పోస్ట్ వద్ద నెలల తరబడి మట్టిలో కూరుకుపోయిన డంపర్ బాడీ ఇందుకు నిదర్శనంగా కనిపిస్తోంది. వెలికితీసి స్క్రాప్‌గా వేలం వేయాల్సిన విలువైన ఇనుప సామగ్రి మట్టి పాలై, వర్షం, వాతావరణ ప్రభావంతో తుప్పు పట్టే పరిస్థితి ఏర్పడింది.

నెలలు గడుస్తున్నా కదలని అధికారులు!

డంపర్ బాడీ మట్టిలో కూరుకుపోయి నెలలు గడుస్తున్నప్పటికీ దానిని బయటకు తీసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మట్టిలో ఉన్న వస్తువును వెలికితీయడానికి అవసరమైన యంత్రాలు, సిబ్బంది సింగరేణి సంస్థకు అందుబాటులో ఉన్నప్పటికీ ఈ నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. చిన్నపాటి చర్యతో బయటకు తీయగలిగే సామగ్రి నెలల తరబడి అక్కడే ఉండటం అధికారుల పర్యవేక్షణ తీరును ప్రశ్నిస్తోంది.

వేలం వేయాల్సిన స్క్రాప్‌కు మట్టే గతి!

వినియోగానికి పనికిరాని యంత్ర భాగాలు, ఇనుప సామగ్రిని గుర్తించి స్క్రాప్‌గా వర్గీకరించి, నిబంధనల ప్రకారం వేలం వేయడం ద్వారా సంస్థకు ఆదాయం సమకూర్చాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం విలువైన డంపర్ బాడీని వెలికితీయకుండా వదిలేయడంతో తుప్పు పట్టి విలువ తగ్గిపోయే ప్రమాదం ఉందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సంస్థకు రావాల్సిన ఆదాయం ఆలస్యమవుతుండగా, మరింత కాలం ఇలాగే వదిలేస్తే స్క్రాప్ విలువ కూడా తగ్గే అవకాశం ఉందని అంటున్నారు.

సింగరేణి ఆస్తుల పరిరక్షణ బాధ్యత ఎవరిది?

సంస్థ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై లేదా? లక్షల విలువైన స్క్రాప్ కళ్లముందే మట్టిలో కూరుకుపోతుంటే సంబంధిత విభాగం ఏం చేస్తోంది? దానిని వెలికితీసేందుకు అడ్డంకులు ఏమిటి? స్క్రాప్‌గా గుర్తించి వేలం వేసే ప్రక్రియ ఎందుకు ప్రారంభించడం లేదు? అనే ప్రశ్నలు కార్మిక వర్గాల్లో వినిపిస్తున్నాయి.సింగరేణి యాజమాన్యం ఇప్పటికైనా స్పందించి మట్టిలో కూరుకుపోయిన డంపర్ బాడీని వెంటనే వెలికితీయాలని, దాని విలువను అంచనా వేసి నిబంధనల ప్రకారం వేలం ప్రక్రియ చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు. సంస్థ ఆస్తుల నిర్వహణలో నిర్లక్ష్యానికి బాధ్యులెవరో గుర్తించి విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.సింగరేణి సంపదను కాపాడాల్సిన బాధ్యత అధికారులదే.. మట్టిలో కూరుకుపోయిన ఆస్తిని వెలికితీయలేని పర్యవేక్షణ వ్యవస్థకు సమాధానం చెప్పేదెవరు?

గ్రామాభివృద్ధికి అడ్డుపడితే ఉపేక్షించేది లేదు!



- అక్రమాలకు తావులేదు.. ప్రభుత్వ భూముల పరిరక్షణే లక్ష్యం
- రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం
- విధులకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు: అంకుశాపూర్ గ్రామ పాలకవర్గం

అంకుశాపూర్ జోర్దార్ ప్రతినిధి:గ్రామ సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన ధ్యేయమని, అభివృద్ధి పనుల్లో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా పాలన సాగిస్తామని అంకుశాపూర్ గ్రామ పాలకవర్గ ప్రతినిధులు స్పష్టం చేశారు. రాజకీయ కక్షలతో గ్రామాభివృద్ధి పనులకు ఆటంకం కలిగించే ప్రయత్నాలను సహించేది లేదని హెచ్చరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులకు ఎదురవుతున్న అడ్డంకులపై గ్రామ పాలకవర్గ ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాత్రికేయుల సమావేశం నిర్వహించి తమ అభిప్రాయాలను వెల్లడించారు.

రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిర్ణయం

గ్రామంలోని వివిధ కాలనీల్లో రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం చేపట్టేందుకు గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిపారు. కాలనీల్లో పిచ్చిమొక్కలు పెరిగి పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో కొండచిలువలు, విషపురుగులు నివాస ప్రాంతాల్లోకి వస్తున్నాయని, దోమల బెడద కూడా పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని రోడ్ల శుభ్రత పనులు చేపడుతుంటే కొందరు ఉద్దేశపూర్వకంగా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత గ్రామ పాలకవర్గంపై ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాలను ప్రజా అవసరాలకు వినియోగించడంతో పాటు పేదల ప్రయోజనాల కోసం కమ్యూనిటీ హాల్ లేదా శివాలయ నిర్మాణం చేపట్టేందుకు గ్రామస్తులు, దాతల సహకారంతో సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు సంబంధించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు.

విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు

పంచాయతీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్న సమయంలో కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని, సర్పంచ్, ఉపసర్పంచ్‌లపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని గ్రామ పాలకవర్గ ప్రతినిధులు ఆరోపించారు. పంచాయతీ విధులను అడ్డుకోవడం, సిబ్బందిని దుర్భాషలాడటం, నిరాధార ఆరోపణలతో వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలపై ఎంపీడీవో, ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు కోరుతామని స్పష్టం చేశారు.

సమావేశంలో పాల్గొన్నవారు

ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ కవిదే కుమారస్వామి, ఉపసర్పంచ్ కడిపికొండ కొండల్ రెడ్డి, వార్డు సభ్యులు రవీందర్, రమేష్, అనిత, స్వరూప, రవి, సుగుణ, రజిత, మాజీ సర్పంచులు కోమల్ రెడ్డి, శంకర్రావు, సంపత్ రావు, మాజీ ఉపసర్పంచులు నోముల శ్రీనివాస్, చెల్పూరి రాములు, కడిపికొండ తిరుపతిరెడ్డి, అశోక్ రెడ్డితో పాటు గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి



- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు వినతిపత్రం అందజేసిన దివ్యాంగులు

వికారాబాద్,జోర్దార్ ప్రతినిధి:వికారాబాద్ పట్టణంలోని ప్రజాభవన్‌లో శుక్రవారం భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్ ఆధ్వర్యంలో దివ్యాంగులు తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు.సొంత ఇళ్లు లేని దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేసి రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. వీల్‌చైర్ వినియోగదారులకు అనుకూలంగా ర్యాంపులు, రహదారులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్, హనుమంతు, భాగ్యమ్మ, సరళ,వెంకటేష్,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి



- కలెక్టర్

ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ఆదిలాబాద్‌లోని టైలర్స్ కాలనీ, పోలీస్ కాలనీల్లో జిల్లా కలెక్టర్ రాజర్షి శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. స్థానికులతో నేరుగా ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద ఇంకుడు గుంతల నిర్మాణం, డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. కాలువలు సరిగా లేక మురుగునీరు నిలుస్తోందని స్థానికులు తెలుపగా, సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

అండాల అక్రమ దందాకు అడ్డుకట్ట
అక్రమ కేంద్రాలు ఇక మూతపడతాయి

- అక్రమ చికిత్సా కేంద్రాలకు చావు దెబ్బ - నమోదు రద్దు, అనుమతి పత్రం ఊడుతుంది
- సంతానం ఆశ చూపి దోచుకునే దందాకు చరమగీతం
- బిడ్డ కోసం తపించే తల్లిదండ్రుల కన్నీళ్లను సొమ్ము చేసుకుంటున్న కేంద్రాలకు హెచ్చరిక
- అద్దె గర్భం, సహాయక పునరుత్పత్తి చట్టాల అమలుకు నిపుణుల బృందం
- మందుల తయారీ నుంచి అమ్మకాల వరకు నిఘా - ప్రభుత్వ సేవలు వేగవంతం

(మిరాల రాజేందర్ రెడ్డి సీనియర్ మెడికల్ జర్నలిస్ట్ హైదరాబాద్)

దంపతులారా జాగ్రత్త!

సంతానం లేదని బాధపడుతున్న దంపతుల బలహీనతను ఆసరాగా చేసుకుని, సంతాన సాఫల్య చికిత్స పేరుతో దోపిడీ చేసే కేంద్రాలపై ప్రభుత్వం ఇక ఉపేక్షించబోదు. అక్రమాలకు పాల్పడితే మూసివేత, శిక్ష తప్పదని ఆరోగ్య శాఖ మంత్రి స్పష్టం చేశారు

1. సమీక్షలో కీలక నిర్ణయాలు

శుక్రవారం రోజున కోఠిలోని కార్యాలయంలో ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ అధికారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అండాల అక్రమ సేకరణ వ్యవహారానికి సంబంధించిన వివరాలను అధికారులు మంతికి వివరించారు.

2. గతంలో ఒక కేంద్రంలో అక్రమాలు - ఇప్పుడు ముఠా పట్టుబడింది

గతంలో ఒక సంతాన సాఫల్య కేంద్రంలో జరిగిన అక్రమాలను ప్రభుత్వం అరికట్టిందని, తాజాగా అండాల అక్రమ సేకరణకు పాల్పడుతున్న ముఠాను గుర్తించి పట్టుకున్నామని మంత్రి పేర్కొన్నారు. ఆరక్షక శాఖతో కలిసి పనిచేస్తూ ఆరోగ్య శాఖ అధికారులు నిరంతర నిఘా, తనిఖీలు కొనసాగిస్తున్నారని తెలిపారు.

3. అక్రమ కేంద్రాలకు శాశ్వత మూసివేత

అండాల అక్రమ సేకరణ ముఠాతో సంబంధాలున్న అన్ని ప్రైవేటు సంతాన సాఫల్య కేంద్రాలను శాశ్వతంగా మూసివేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అక్రమాలకు పాల్పడే కేంద్రాల నమోదును శాశ్వతంగా రద్దు చేయాలని సూచించారు. ఇలాంటి కేంద్రాలపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

4. వైద్యుల అనుమతి పత్రాల రద్దుకు సిఫారసు

అక్రమాల్లో భాగస్వాములైన వైద్యుల అనుమతి పత్రాలను శాశ్వతంగా రద్దు చేసే అవకాశాలను కూడా పరిశీలించాలని ఆదేశించారు. ఈ విషయంలో రాష్ట్ర వైద్య మండలి, జాతీయ వైద్య మండలి అధికారులతో సంప్రదింపులు జరిపి, నిబంధనల ప్రకారం వారి అనుమతి పత్రాల రద్దుకు సిఫారసు చేయాలని స్పష్టం చేశారు.

5. దోషులకు కఠిన శిక్ష పడేలా సమగ్ర విచారణ

ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న వ్యక్తులు, సంస్థలపై సమగ్ర విచారణ జరిపి, దోషులకు చట్ట ప్రకారం కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. దర్యాప్తులో ఆరక్షక శాఖకు ఆరోగ్య శాఖ అధికారులు పూర్తి సహకారం అందించాలని సూచించారు.

6. అద్దె గర్భం, సహాయక పునరుత్పత్తి చట్టాల అమలు పటిష్ఠంఅద్దె గర్భం, సహాయక పునరుత్పత్తి సాంకేతికత చట్టాల అమలును మరింత పటిష్ఠం చేయడంపై మరింత దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఈ చట్టాల అమలులో ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలు, తీసుకుంటున్న చర్యలను అధ్యయనం చేసేందుకు నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. దేశవ్యాప్తంగా అమలులో ఉన్న కేంద్ర చట్టాల పరిధిలోనే రాష్ట్ర స్థాయిలో అదనపు నియంత్రణ చర్యలు, మార్గదర్శకాలు రూపొందించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

7. మందుల తయారీ నుంచి అమ్మకాల వరకు నిఘా

ప్రైవేటు సంతాన సాఫల్య కేంద్రాల కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడే సంస్థలపై కఠినంగా వ్యవహరించాలని మంత్రి ఆదేశించారు. సంతాన సాఫల్య చికిత్సలో ఉపయోగించే మందుల తయారీ నుంచి అమ్మకాల వరకూ ప్రత్యేకంగా నిఘా ఉండాలని మందుల నియంత్రణ అధికారులకు మంత్రి సూచించారు.

8. ప్రభుత్వ సేవలు పారదర్శకంగా - విస్తరణ వేగవంతం

సంతానలేమి సమస్యతో సంతాన సాఫల్య సేవలను ఆశ్రయించే దంపతులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దోపిడీ, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉన్న సంతాన సాఫల్య చికిత్సా సేవలు పారదర్శకంగా, చట్టబద్ధంగా కొనసాగించేలా పటిష్ఠమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ సంతాన సాఫల్య సేవల విస్తరణ చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజలకు విజ్ఞప్తి సంతాన సాఫల్య చికిత్స కోసం వెళ్ళే ముందు ఆ కేంద్రానికి సరైన నమోదు, అనుమతి ఉందో లేదో తెలుసుకోండి. అనుమానం వస్తే వెంటనే ఆరోగ్య శాఖ అధికారులకు తెలియజేయండి.

విఐపి సంస్కృతిపై 'దళపతి' దెబ్బ!

- ప్లాస్టిక్ కుర్చీలో పాలకుడు.. పోలీస్ స్టేషన్‌లో సామాన్యుడిలా
- తమిళనాడు సీఎం విజయ్
- సిఐ ముందే కూర్చుని ఆకస్మిక తనిఖీ.. సోషల్ మీడియాలో వైరల్ అయిన దృశ్యాలు

తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త పాలనా ఒరవడి దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ (దళపతి విజయ్) ఇటీవల కోయంబత్తూరులోని కరుమత్తంపట్టి పోలీస్ స్టేషన్‌లో ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా నిర్వహించిన ఆకస్మిక తనిఖీ ఒక సరికొత్త చర్చకు తెరలేపింది. ఈ పర్యటనలో ఆయన స్టేషన్ ఇన్‌స్పెక్టర్ (CI) టేబుల్ ముందు, కేవలం సాధారణ ప్రజలు కూర్చునే ఒక ప్లాస్టిక్ కుర్చీలో కూర్చుని మాట్లాడిన తీరు సోషల్ మీడియాను ఊపేస్తోంది. హోదాను పక్కనపెట్టి, సామాన్యుడి స్థానంలో కూర్చుని ఆయన అందించిన సందేశం.. దశాబ్దాలుగా వేరుగుకుపోయిన 'విఐపి సంస్కృతి'పై గట్టి దెబ్బ కొట్టిందని సామాజిక విశ్లేషకులు భావిస్తున్నారు.

రెడ్ కార్పెట్ సంస్కృతికి చరమగీతం: పాలకుడు అంటే సేవకుడే !

మన దేశంలో ప్రజాప్రతినిధులు, మంత్రులు లేదా సీఎంలు ఒక ప్రభుత్వ కార్యాలయానికి వస్తున్నారంటే చాలు.. అక్కడ రెడ్ కార్పెట్లు, ప్రత్యేక సోఫాలు, ఏసీలు, కళ్ళు మిరుమిట్లు గొలిపే హంగులు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా మారింది. కానీ ముఖ్యమంత్రి విజయ్ ఇందుకు భిన్నంగా వ్యవహరించారు. నిత్యం పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఒక సాధారణ పౌరుడు ఎక్కడ కూర్చుంటాడో, అదే ప్లాస్టిక్ కుర్చీలో కూర్చుని అధికారులతో మాట్లాడారు.

ఇది కేవలం ఒక ప్రచార చిత్రం కాదు, ప్రభుత్వ వ్యవస్థల ముందు సామాన్యుడికి దక్కాల్సిన గౌరవాన్ని గుర్తుచేసే ఒక నిశ్శబ్ద విప్లవం. సీఎం అంత సరళంగా ఉన్నప్పుడు, తాము ప్రజలతో ఎంత మర్యాదగా ప్రవర్తించాలనే ఆలోచన కింది స్థాయి అధికారుల్లో ఈ సంఘటన రేకెత్తించింది.

ఏసీ రూముల సమీక్షలు వద్దు.. క్షేత్రస్థాయి వాస్తవాలే ముద్దు!

ప్రతి రాష్ట్ర ముఖ్యమంత్రి లేదా పాలకుడు ఏసీ రూముల్లో, సచివాలయాల్లో కూర్చుని సమీక్షలు జరిపితే క్షేత్రస్థాయి వాస్తవాలు పూర్తిగా బయట పడవు. అధికారులు ఇచ్చే నివేదికలకే పరిమితం కాకుండా, ప్రతి ఒక్క సీఎం ఈ తరహా ఆకస్మిక తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆకస్మికంగా వెళ్ళినప్పుడే ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు ఎందుకు దొరకడం లేదు, హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి భోజనం పెడుతున్నారు, పోలీస్ స్టేషన్లలో సామాన్యుడికి న్యాయం జరుగుతుందా లేదా అనే పచ్చి నిజాలు పాలకులకు నేరుగా తెలుస్తాయి. తమిళనాడు సీఎం గతంలో ఎగ్మోర్ ప్రభుత్వ పిల్లల ఆసుపత్రిని, విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్‌లను ఇలాగే ఆకస్మికంగా సందర్శించి లోపాలను సరిదిద్దారు.

దేశవ్యాప్త సీఎంలకు విజయ్ 'ప్లాస్టిక్ కుర్చీ' ఒక పాఠం కావాలి!

ప్రజాస్వామ్యంలో ప్రజలే సుప్రీం అని, పాలకులు వారి సేవకులే అనే భావన బలపడాలంటే మిగతా రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఈ బాట పట్టాలి. కేవలం ఎన్నికల ప్రచారాల సమయంలోనే జనం మధ్యకు రావడం కాకుండా, అధికారంలో ఉన్న ఐదేళ్లూ ఇలాంటి 'సర్ప్రైజ్ విజిట్స్' చేస్తూ, సామాన్యుడికి చేరువగా వెళ్లినప్పుడే ప్రజల్లో ప్రభుత్వాలపై నమ్మకం పెరుగుతుంది.

ప్రజాసేవలో హంగులు, ఆర్భాటాలు కాకుండా ఫలితాలు, పారదర్శకత ముఖ్యం అని నిరూపిస్తున్న విజయ్ చూపిన ఈ ప్లాస్టిక్ కుర్చీ మార్గం.. భారతీయ రాజకీయాల్లో విఐపి సంస్కృతి అంతానికి, ఒక నూతన ప్రజాస్వామ్య అధ్యాయానికి నాంది కావాలని దేశ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.



గోవిందు నరేష్,
లీసెర్చ్ స్కాలర్,సామాజిక విశ్లేషకులు

మట్టి దీపాల తయారీలో
చిన్నారుల ప్రతిభకు ఎమ్మెల్యే ప్రశంసలు



● మల్లికాంబ మనోవికాస కేంద్రం చిన్నారులను అభినందించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హనుమకొండ,జోర్దార్ ప్రతినిధి:మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన చిన్నారులు తమ స్వహస్తాలతో తయారు చేసిన అందమైన మట్టి దీపాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు సుబేదారిలోని క్యాంపు కార్యాలయంలోఅందజేశారు. చిన్నారుల సృజనాత్మకత,ప్రతిభను చూసి ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసి ప్రోత్సహిస్తే వారు ఉన్నత స్థాయికి ఎదుగుతారని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చిన్నారుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొంది స్తాయని అన్నారు.ఈ సందర్భంగా చిన్నారులతో పాటు వారికి శిక్షణ నిస్తూ ప్రోత్సహిస్తున్న కేంద్రం నిర్వాహకురాలు రామలీలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

బషీరాబాద్ ఎస్సీ హాస్టల్
తాగునీటి సమస్యకు పరిష్కారం

● ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి చొరవతో నూతన బోర్‌వెల్ పనులు ప్రారంభం



బషీరాబాద్,జోర్దార్ ప్రతినిధి:వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థుల తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. హాస్టల్‌లో నీటి సమస్యను తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించారు.షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి నిధుల నుంచి హాస్టల్‌లో నూతన బోర్ వెల్ ఏర్పాటు పనులను ప్రారంభించారు.

తాగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న ఎమ్మెల్యేకు హాస్టల్ విద్యార్థులు, సిబ్బంది కృత జ్ఞతలు తెలిపారు.

ఇల్లంతకుంటను అన్నిరంగాల్లో
అభివృద్ధి చేయడమే మా లక్ష్యం

● దార సురేష్

● 108 అంబులెన్స్ ఏర్పాటు చేయాలి.. డయాలసిస్ రోగుల సమస్యలు పరిష్కరించాలి

● అధికారులకు వినతిపత్రం అందజేసిన మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు దార సురేష్





(ఇల్లంతకుంట జోర్దార్ ప్రతినిధి)ఇల్లంతకుంట మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దార సురేష్ అన్నారు. మండలంలోని 18 గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. మండల ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా 108 అంబులెన్స్ ఏర్పాటు చేయాలని, ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో రోగులను సకాలంలో ఆసుపత్రులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. అదేవిధంగా డయాలసిస్ రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించి వారికి అవసరమైన మందులు ఉచితంగా అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. మండలంలోని గ్రామీణ రహదారుల అభివృద్ధితో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆర్‌అండ్‌బీ పరిధిలోని రహదారుల సమస్యలను పరిష్కరించి అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా దార సురేష్ మాట్లాడుతూ గ్రామాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని, ఇల్లంతకుంట మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సర్పంచుల ఫోరం లక్ష్యమని తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం మండల
నూతన కమిటీ ఎన్నిక



● అధ్యక్షుడిగా పైడిపల్లి రవీందర్ గౌడ్

సైదాపూర్,జోర్దార్ ప్రతినిధి:సైదాపూర్ మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ ఆవరణలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడిగా పైడిపల్లి రవీందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా దోకిడి తిరుపతి ఎన్నికయ్యారు.యువజన విభాగం అధ్యక్షుడిగా మామిడి సురేష్,కార్యదర్శిగా వస్తాదుల సదానందం, గౌరవ అధ్యక్షులుగా రాయిచెట్టి చంద్రయ్య, సోమరపు రాజయ్య ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా కనకయ్య గౌడ్ మాట్లాడుతూ బీసీల హక్కుల సాధనకు కుల సంఘాల నాయకులు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

గ్రామీణ పాఠశాలలకు గొడ్డలిపెట్టులా మారిన
జిల్లా విద్యాశాఖ సిబ్బంది తీరు

● కలెక్టర్ ఆదేశాలకు తూట్లు - ఉపాధ్యాయ సంఘాల ఏకాభిప్రాయానికి విరుద్ధంగా వర్క్ అడ్జస్ట్‌మెంట్.

(వరంగల్ జోర్దార్ ప్రతినిధి) నిబంధనలకు విరుద్ధంగా గ్రామీణ ఉపాధ్యాయులను నగరానికి బదిలీ చేస్తున్న వైనంGO25 సిటీ ప్రాంతాలకేనా, గ్రామీణ ప్రాంతాలకి వర్తించదా అక్రమ డెప్యూటేషన్లను రద్దు చేసి, గ్రామీణ విద్యార్థులకు న్యాయం చేయాలని సంఘాల డిమాండ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన అవే లిస్టు రావడం ఏమిటీ?
డెప్యూటేషన్ల అక్రమాలపై ఎన్నిసార్లు వార్తలు వచ్చినా జిల్లా విద్యాశాఖ (ణఖూ) కార్యాలయ సిబ్బంది తీరులో మార్పు రావడం లేదు. తాజాగా విడుదల చేసిన రెండో విడత వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉత్తర్వుల్లో అధికారుల చేతివాటం స్పష్టంగా కనిఎస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం నిర్వహించి, అందరి ఏకాభిప్రాయంతో రూపొందించిన జాబితాను విద్యాశాఖ సిబ్బంది పక్కన పెట్టారు. ప్రతిపాదనల్లో లేని పేర్లను ఇష్టానుసారంగా చేరుస్తూ, గ్రామీణ ప్రాంత ఉపాధ్యాయులను నగర ప్రాంతాలకు డెప్యూటేషన్‌పై పంపించారు. జాబితాలో ఉన్న కొన్ని పేర్లు తమకు తెలియకుండానే వచ్చాయని స్వయంగా ఎంఈఓలే (వీజూ) చెప్పడం ఇందులో జరిగిన అవకతవకలకు అద్దం పడుతోంది.

ఉత్తర్వుల్లోని ప్రధాన అక్రమాలు:
కలెక్టర్ పనిష్మెంట్ ఉత్తర్వుల ఉల్లంఘన: గతంలో పలు ఆరోపణలు రావడంతో కలెక్టర్ స్వయంగా నల్ల బెల్లి మండలం ఎంపీపీఎస్ (MPPS) అసర వెల్లి పాఠశాలకు పనిష్మెంట్ కింద కేటాయించిన ఓ ఉపాధ్యాయుడిని, ఎలాంటి ప్రతిపాదన లేకుండానే ఖిలా వరంగల్ మండలం ఎంపీపీఎస్ బెస్తం చెరువుకు డెప్యూటేషన్ వేశారు.
అవసరమున్న చోట కాకుండా నగరానికి జడ్పీ హెచ్ఎస్ (ZPHS) గోవనపల్లిలో ఎస్ఏ (SA) హిందీ ఉపాధ్యాయుడి అవసరం ఉన్నందున అక్కడికి సర్దుబాటు చేయాలని యూనియన్ నాయకులు సూచించినా, ఆ ఉపాధ్యాయుడిని నగర ప్రాంతానికి తీసుకువచ్చారు.

ఉత్తర్వులు రాకముందే విధుల్లోకి:నెక్కొండ నుంచి ఒక ఎస్జీటీని (SGT) ఖిలా వరంగల్ మండలం ఎంపీపీఎస్ మద్దెల చెరువు పాఠశాలకు బదిలీ చేస్తూ తాజాగా ఉత్తర్వులు ఇచ్చారు. అయితే, ఉత్తర్వులు రాకముందే దసరా సెలవుల మరుసటి రోజు నుంచే సదరు ఉపాధ్యాయుడు ఆ పాఠశాలకు వెళ్తుండటం గమనార్హం.

విధుల్లో చేరకుండానే తిరిగి సొంత పాఠశాలకు: ఎంపీపీఎస్ అంబేద్కర్ నగర్ నుంచి ఉర్సు గుట్టకు బదిలీ అయిన ఓ ఎల్ఎఫ్ఎల్ (LFL) హెచ్ఎం, అక్కడ ఒక్కరోజు కూడా విధుల్లో చేరలేదు. అయినప్పటికీ ప్రస్తుత ఉత్తర్వుల్లో ఆయన్ను తిరిగి సొంత పాఠశాలకు కేటాయించారు.

అశోక్ నగర్ పాఠశాలపై వివక్ష:90మంది విద్యార్థులు ఉన్న ఎంపీపీఎస్ అశోక్ నగర్‌లో ఏడుగురు ఉపాధ్యాయులు ఉండగా, ఇప్పటికే ఒకరు డెప్యూటేషన్‌పై వెళ్లారు. తాజాగా మరో ఇద్దరిని బదిలీ చేశారు. వీరిలో ఒకరిని అవసరం లేని ఎంపీపీఎస్ గీసుకొండకు, మరొకరిని ఎంఈఓ మరియు యూనియన్ ప్రతిపాదనలు లేకుండానే నగరంలోని నరేంద్ర నగర్‌కు పంపారు.

కలెక్టర్ ఉత్తర్వుల బేఖాతరు: కలెక్టర్ ఆదేశాలతో ఇప్పటికే యూపీఎస్ (UPS) రంగాపురానికి అడ్జస్ట్‌మెంట్ అయిన ధర్మారావుపేట ఉపాధ్యాయురాలిని, నేటి ఉత్తర్వుల్లో నగరంలోని పైడిపల్లి పాఠశాలకు మార్చారు.

విద్యార్థులున్నా ఉపాధ్యాయుడి తరలింపు: ఎంపీఎ ఎస్ బాలు తండాలో 12 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ, అక్కడి ఉపాధ్యాయుడిని అవసరం లేని లక్నపల్లి పాఠశాలకు పంపారు. ఆ ఉపాధ్యాయుడిని తిరిగి పంపాలని ఎంఈఓ, యూనియన్ సమావేశంలో తీర్మానించినా అధికారులు పట్టించుకోవడం లేదు.

ఉపాధ్యాయ సంఘాల డిమాండ్:
ప్రతి మండలం నుంచి తమకు నచ్చిన ఐదుగురు ఉపాధ్యాయుల పేర్లు పంపాలని విద్యాశాఖ సిబ్బంది ఎంఈఓలపై ఒత్తిడి తెచ్చి మరీ ఈ డెప్యూటేషన్లు వేశారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.
గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తీరని అన్యాయం చేసేలా, నిబంధనలకు విరుద్ధంగా వేసిన ఈ డెప్యూటేషన్లను తక్షణమే రద్దు చేయాలని సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సమన్వయ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు తూట్లు పొడిచి, అక్రమాలకు పాల్పడిన విద్యాశాఖ కార్యాలయ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి.
జిల్లా కలెక్టర్ గారికి కొన్ని ఉపాధ్యాయ సంఘం డెప్యూటేషన్‌లలో అవకతవకలు జరిగాయని ఫిర్యాదు చేసిన లిస్టులో ఎలాంటి మార్పులు లేకుండా రావడం కోసం మెరుపు

బరువు తగ్గించే జీఎల్‌పీ-1 మందులను వాడితే
కండరాల నష్టం జరుగుతుందా..? ఏం చేయాలి..?

బరువు తగ్గేందుకు ఉపయోగించే జీఎల్‌పీ 1 (GLP-1) ఔషధాలు ఊబకాయం చికిత్సలో కీలక మార్పులు తీసుకొచ్చాయి. సెమాగ్లుటైడ్, టిర్జెపటైడ్ వంటి మందులు ఆకలిని తగ్గించి, కడుపు నిండిన భావనను ఎక్కువసేపు కలిగించడం ద్వారా బరువు తగ్గేందుకు సహాయపడుతున్నాయి. అయితే బరువు తగ్గడం మాత్రమే ఆరోగ్యకరమైన శరీరానికి కొలమానం కాదు. కొవ్వుతోపాటు కండరాల పరిమాణం కూడా తగ్గే అవకాశం ఉంటుంది. దీనివల్ల కొందరిలో కండరాల ఆకృతి, బలం తగ్గినట్లు కనిపిస్తుంది. అందుకే ఈ మందులు వాడుతున్నప్పుడు శరీరంలోని కొవ్వును తగ్గించడంతోపాటు కండరాలను కాపాడుకోవడంపై కూడా దృష్టి పెట్టాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇందుకు సరైన ఆహారం, తగినంత ప్రొటీన్, క్రమబద్ధమైన వ్యాయామం, విశ్రాంతి అవసరం. అయితే ప్రతి ఒక్కరిలో శరీర మార్పులు ఒకేలా ఉండవు. ప్రారంభంలో ఉన్న కండరాల పరిమాణం, ఆహారపు అలవాట్లు, వ్యాయామం, బరువు తగ్గే వేగం, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులపై ఫలితాలు ఆధారపడి ఉంటాయి.

ప్రోటీన్ల పాత్ర కీలకం..
కండరాలను కాపాడుకోవడంలో ప్రొటీన్ కీలక పాత్ర పోషిస్తుంది. శరీరంలో కండరాల మరమ్మత్తు, నిర్వహణకు ఇది అవసరం. అయితే ఈ మందుల వల్ల ఆకలి తగ్గడంతో కొందరు తగినంత ఆహారం తీసుకోలేకపోతారు. సాధారణంగా బరువు తగ్గే దశలో ఉన్న కొందరు పెద్దలకు రోజుకు ప్రతి కిలో శరీర బరువుకు 1.2 నుంచి 1.6 గ్రాముల ప్రొటీన్ అవసరమవుతుందని పోషకాహార నిపుణులు సూచిస్తుంటారు. అయితే ఇది అందరికీ వర్తించే నియమం కాదు. ముఖ్యంగా మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా తీసుకోవాలి. గుడ్లు, చేపలు, చికెన్, పాలు, పెరుగు, పనీర్, పప్పులు, శనగలు, సోయా వంటి వాటి ద్వారా ప్రొటీన్ పొందవచ్చు. ఆహారంతో సరిపడా అందకపోతే వైద్యుల సూచనతో ప్రొటీన్ సప్లిమెంట్లు తీసుకోవాలి. ఆకలి తక్కువగా ఉన్నవారు చిన్న పరిమాణంలో పోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం మంచిది. అదే సమయంలో వారానికి రెండు లేదా మూడు రోజులు స్ట్రాట్స్, పుష్‌అప్స్, వెయిట్ ట్రైనింగ్ వంటి కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలు చేయాలి. బరువులను, వ్యాయామ తీవ్రతను క్రమంగా పెంచుకోవాలి.



ఆహారాన్ని అతిగా తగ్గించవద్దు..
బరువు తగ్గాలనే ఉద్దేశంతో ఆహారాన్ని అతిగా తగ్గించడం మంచిది కాదు. శరీరానికి అవసరమైన ప్రొటీన్, విటమిన్లు, ఖనిజాలు అందకపోతే బలహీనత ఏర్పడుతుంది. కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్ ఉండే సమతుల ఆహారం తీసుకోవాలి. నడక, సైక్లింగ్, ఈత వంటి వ్యాయామాలు గుండె ఆరోగ్యానికి, శారీరక సామర్థ్యానికి తోడ్పడతాయి. వారానికి కనీసం 150 నిమిషాల మితమైన శారీరక శ్రమతోపాటు, వారంలో రెండు రోజులు కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలు చేయాలని సాధారణ ఆరోగ్య మార్గదర్శకాలు సూచిస్తున్నాయి.
రోజుకు 7 నుంచి 9 గంటల నిద్ర కూడా అవసరం. ఈ మందులు వాడేవారిలో వికారం, వాంతులు, విరేచనాలు లేదా మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి. వీటివల్ల ఆహారం, నీరు తీసుకోవడం తగ్గితే వైద్యులను సంప్రదించాలి. తీవ్రమైన కడుపునొప్పి లేదా నీరు కూడా నిలవని పరిస్థితి ఉంటే వెంటనే వైద్య సహాయం పొందాలి.

వైద్యుల సలహా అవసరం..
బరువు కొలిచే యంత్రం చూపించే సంఖ్యతో మాత్రమే శరీరంలో కొవ్వు, కండరాల మార్పులను అంచనా వేయలేం. వ్యాయామ సమయంలో పెరుగుతున్న బలం, నడుము కొలత, రోజువారీ పనులు చేసుకునే సామర్థ్యం, శక్తి స్థాయిలను కూడా గమనించాలి. అవసరమైతే వైద్యులు శరీర కూర్పును అంచనా వేసే పరీక్షలు సూచిస్తారు. ప్రొటీన్ లేదా ఇతర పోషకాహార సప్లిమెంట్లను సొంతంగా ప్రారంభించకూడదు. అలాగే వైద్యుల సలహా లేకుండా జీఎల్పీ-1 మందుల మోతాదును మార్చడం లేదా వాటిని ఆపడం చేయరాదు. ఆకలి తగ్గడం వల్ల సరిపడా ఆహారం తీసుకోలేకపోతున్నా, కండరాల బలం గణనీయంగా తగ్గినా వైద్యులను సంప్రదించాలి. వేగంగా బరువు తగ్గడమే లక్ష్యంగా పెట్టుకోకుండా, కండరాల బలం, శారీరక సామర్థ్యం, మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ స్థిరంగా బరువు తగ్గడమే ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు

పోషకాహార ఉత్పత్తులను తీసుకునే ముందు జాగ్రత్త
అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు

బరువు తగ్గడం నుంచి చర్మాన్ని యవ్వనంగా మార్చడం వరకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయని ప్రచారం చేస్తున్న పోషకాహార అనుబంధ ఉత్పత్తుల ప్రకటనలపై భారతీయ ప్రకటనల ప్రమాణాల మండలి (ఏఎస్‌సీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. జూలై నుంచి సెప్టెంబర్ మధ్య పరిశీలించిన 61 ప్రకటనల్లో 60 ప్రకటనలు తగిన శాస్త్రీయ ఆధారాలు చూపించలేక నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించింది. వీటిలో 29 ప్రకటనదారులు అభ్యంతరాలను వ్యతిరేకించలేదు. మిగిలిన 31 మంది తమ వాదనలకు సరైన ఆధారాలు సమర్పించలేకపోయారు. 60 రోజుల్లో ఆరు కిలోల బరువు తగ్గడం, చర్మాన్ని ఏడేళ్లు యవ్వనంగా చూపించడం, ఆస్తమా లేదా పాలీసిస్టిక్ ఓవరీ వ్యాధిని పూర్తిగా తగ్గించడం వంటి హామీలను ఈ ప్రకటనల్లో గుర్తించారు. అయితే ఈ ఉల్లంఘనలు ఉన్నంత మాత్రాన ఆ ఉత్పత్తులన్నీ అసురక్షితమైనవని లేదా అన్ని సందర్భాల్లో పనికిరావని అర్థం కాదని ఏఎస్‌సీఐ స్పష్టం చేసింది. ఒక పదార్థంపై జరిగిన పరిశోధన ఆధారంగా, ఆ పదార్థం ఉన్న ప్రతి వాణిజ్య ఉత్పత్తి కూడా అదే ఫలితాన్ని ఇస్తుందని చెప్పలేమని నిపుణులు సూచిస్తున్నారు.

తప్పుదోవ పట్టిస్తున్న ప్రకటనలు..
భారత్‌లో పోషకాహార అనుబంధాలు, న్యూట్రాస్యూటికల్స్‌ను ఔషధాలుగా కాకుండా ఆహార ఉత్పత్తులుగా పరిగణిస్తారు. వీటి తయారీ, పదార్థాల వినియోగం, పరిమాణం, లేబులింగ్‌కు సంబంధించి 2016లో భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రత్యేక నిబంధనలు రూపొందించింది. ఇవి పోషక అవసరాలను తీర్చడానికి, శరీర ఆరోగ్యానికి తోడ్పడడానికి ఉద్దేశించినవే తప్ప వ్యాధులను నయం చేయడానికి లేదా నివారించడానికి ఉద్దేశించినవి కావు. అందువల్ల ఆస్తమా, పీసీఓఎస్ వంటి వ్యాధులను తగ్గిస్తాయని లేదా పూర్తిగా నయం చేస్తాయని అనుమతి లేకుండా ప్రచారం చేయరాదు. అలాగే 2018లో రూపొందించిన ప్రకటనలు, ఆరోగ్య ప్రయోజనాల నిబంధనల ప్రకారం ఉత్పత్తులపై చేసే ఆరోగ్య సంబంధిత వాదనలకు తగిన శాస్త్రీయ ఆధారాలు ఉండాలి. అవసరమైన సందర్భాల్లో మనుషులపై నిర్వహించిన నాణ్యమైన పరిశోధనల ఆధారాలనూ సమర్పించాలి.

ఉత్పత్తిదారులకు హెచ్చరికలు..
అక్టోబర్ 15న ఎఫ్ఎస్ఎస్ఏఐ మరోసారి ప్రత్యేక సూచనలు జారీ చేసింది. న్యూట్రాస్యూటికల్స్, ఆరోగ్య అనుబంధాలు వంటి ఉత్పత్తుల్లో వాడే మొక్కలు, వాటి సారాలకు సంబంధించిన లేబుళ్లపై తప్పనిసరి వివరాలు, హెచ్చరికలు ఉండాలని తయారీదారులను ఆదేశించింది. ఉపయోగించిన మొక్కలోని ఏ భాగాన్ని పదార్థంగా తీసుకున్నారో పేర్కొనడంతోపాటు, సంబంధిత జాగ్రత్తలు, హెచ్చరికలను ముద్రించాలి. సహజమైనవని చెప్పుకునే మూలికా పదార్థాలు కూడా దుష్ప్రభావాలను కలిగిస్తాయి, లేదా ఇతర మందులతో ప్రతికూలంగా స్పందిస్తాయి. నిబంధనలను ఉల్లంఘిస్తే ఆహార భద్రత చట్టం ప్రకారం జరిమానాలు, లైసెన్సుల నిలిపివేత లేదా రద్దు వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. మరోవైపు, వినియోగదారుల రక్షణ చట్టం కింద కేంద్ర వినియోగదారుల పరిరక్షణ ప్రాధికార సంస్థ కూడా తప్పుదు ప్రకటనలపై చర్యలు తీసుకోవచ్చు. మొదటిసారి ఉల్లంఘనకు రూ.10 లక్షల వరకు, తదుపరి ఉల్లంఘనలకు రూ.50 లక్షల వరకు జరిమానా విధించవచ్చు.

జాగ్రత్తలు తప్పనిసరి..
అనుబంధ ఉత్పత్తులు కొనుగోలు చేసే ముందు వినియోగదారులు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. వేగంగా బరువు తగ్గిస్తామని, వృద్ధాప్య లక్షణాలను వెంటనే తగ్గిస్తామని లేదా దీర్ఘకాలిక వ్యాధులను పూర్తిగా నయం చేస్తామని చెప్పే ప్రకటనలను నమ్మకూడదు. ఉత్పత్తి లేబుల్‌పై పదార్థాలు, వాడే విధానం, హెచ్చరికలు, తయారీదారు వివరాలు, సంబంధిత అనుమతులను పరిశీలించాలి. ప్రముఖుల ప్రచారం, సామాజిక మాధ్యమాల్లోని అనుభవాలు, ముందు-తర్వాత చిత్రాలు శాస్త్రీయ ఆధారాలకు ప్రత్యామ్నాయం కావు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీత అంతం - మా పంతం
శనివారం,
నవంబర్ 07 2026

వన్డేల్లో గిల్ నంబర్ వన్.. టాప్-10లోకి విరాట్ కోహ్లీ ఎంట్రీ



2026లో వన్డే క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మరోవైపు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కూడా టాప్-10లోకి చేరాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో కోహ్లీ 74 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ప్రదర్శనతో ఈ ఏడాది వన్డేల్లో అతడి పరుగుల సంఖ్య 626కు చేరింది. గిల్, కోహ్లీ మాత్రమే ఈ జాబితాలో చోటు దక్కించుకున్న భారత ఆటగాళ్లుగా నిలిచారు.68 పరుగులు చేస్తే గిల్ ఖాతాలో 1000 రన్స్మభ్‌మన్ గిల్ ఈ ఏడాది వన్డేల్లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో 37 పరుగులు చేసిన అతడి మొత్తం స్కోరు 932కు చేరింది. 12 ఇన్నింగ్స్‌లో 103.55 సగటుతో పరుగులు సాధించాడు. అతడి స్ట్రైక్ రేట్ 115కు పైగా ఉంది. ఇప్పటివరకు మూడు సెంచరీలు, ఐదు అర్ధ సెంచరీలు సాధించాడు. ఇందులో ఒక డబుల్ సెంచరీ కూడా ఉంది. మరో 68 పరుగులు చేస్తే 2026లో వన్డేల్లో 1000 పరుగుల మైలురాయిని అందుకుంటాడు.గిల్‌కు తర్వాత ఇంగ్లండ్ ఓపెనర్ బెన్ డకెట్ రెండో స్థానంలో ఉన్నాడు. అతడు 13 ఇన్నింగ్స్‌లో 737 పరుగులు చేశాడు. గిల్ కంటే డకెట్ ఒక ఇన్నింగ్స్ ఎక్కువగా ఆడినా, పరుగుల్లో మాత్రం 195 వెనుకబడి ఉన్నాడు. శ్రీలంక ఆటగాడు పవన్ రత్నాయకే 692 పరుగులతో మూడో స్థానంలో నిలిచాడు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ 680 పరుగులతో నాలుగో స్థానంలో ఉన్నాడు. గిల్ నిలకడగా పరుగులు సాధిస్తుండటంతో ఈ ఏడాది అగ్రస్థానాన్ని అందుకోవడం ఇతర బ్యాటర్లకు సవాలుగా మారింది.2026లో అత్యధిక వన్డే పరుగులు చేసిన టాప్-10 బ్యాటర్లువిరాట్ కోహ్లీ 10 మ్యాచ్‌ల్లో 626 పరుగులు చేసి ఈ జాబితాలో పదో స్థానంలో ఉన్నాడని అందించిన గణాంకాలు చెబుతున్నాయి. అతడి సగటు 69.55గా ఉంది. మరోవైపు జో రూట్ 680 పరుగులతో కోహ్లీ కంటే ముందున్నాడు. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో కోహ్లీ మరిన్ని పరుగులు సాధిస్తే తన స్థానాన్ని మెరుగుపరుచుకునే అవకాశం ఉంది. ఈ ఏడాది అత్యధిక పరుగులు చేసిన టాప్-10 బ్యాటర్ల జాబితా ఇలా ఉంది.

రూ.18 వేల జీతంతో కెరీర్ ప్రారంభం..



ఒకప్పుడు నెలకు రూ.18,000 జీతంతో తన కెరీర్‌ను ప్రారంభించిన 26 ఏళ్ల అర్జున్ పర్మార్.. ఇప్పుడు సంవత్సరానికి సుమారు రూ.50 లక్షలు సంపాదిస్తున్నాడు. కేవలం మూడేళ్లలోనే అతని ఆర్థిక ఆస్తులు దాదాపు రూ.65 నుండి రూ.75 లక్షలకు పెరిగాయి. ఈ సమయంలో అతను తన ఆదాయాన్ని పెంచుకోవడమే కాకుండా, మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు, అత్యవసర నిధులు, కుటుంబ బాధ్యతలను సమతుల్యం చేసుకోవడం కూడా నేర్చుకున్నాడు.అయితే అర్జున్ ప్రయాణం కేవలం మంచి ఉద్యోగం, పెరుగుతున్న జీతం కథ మాత్రమే కాదు. ఈ కాలంలో అతను ఉద్యోగం కోల్పోయే షాక్‌ను కూడా ఎదుర్కొన్నాడు. మే 2026లో కంపెనీ ఉద్యోగల తొలగింపు సమయంలో అతను తన ఉద్యోగాన్ని కోల్పోయాడు. అయితే సుమారు రూ.6 లక్షల అత్యవసర పొదుపు ఆ కష్టకాలంలో అతనికి సహాయపడింది. ఆ తర్వాత, సెప్టెంబర్ 2026లో అతను సుమారు రూ.50 లక్షల వార్షిక జుజతో కొత్త ఉద్యోగంలో చేరాడు.
బాగా సంపాదించడంతో పాటు, డబ్బు ఆదా చేయడం, తెలివిగా పెట్టుబడి పెట్టడం కష్టకాలానికి సిద్ధంగా ఉండటం ప్రాముఖ్యతను అర్జున్ లైఫ్‌స్టైల్ వివరిస్తుంది. అతని ప్రయాణం, యువ ఉద్యోగ నిపుణులకు డబ్బుకు సంబంధించిన ఏడు ముఖ్యమైన పాఠాలను అందిస్తుంది.1. మీ మొదటి జీతం మీ భవిష్యత్తును నిర్ణయించనివ్వకండి:
ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ నివేదిక ప్రకారం, అర్జున్ పర్మార్ మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిన్‌లో ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు. అతని తండ్రి ఒక చిన్న ఎలక్ట్రికల్ వస్తువుల వ్యాపారాన్ని నడుపుతున్నారు. 2023లో తన చదువు పూర్తి చేసిన తర్వాత అతను టెక్ మహీంద్రాలో సాఫ్ట్‌వేర్ ట్రైనీ, డెవలపర్‌గా ఉద్యోగం సంపాదించాడు. అతని వార్షిక ప్యాకేజీ సుమారుగా రూ.2.2 లక్షలు కాగా, అతను నెలకు సుమారు రూ.18,000 జీతం సంపాదించాడు. తన కళాశాల స్నేహితులలో కొందరు అతని కంటే ఎక్కువ సంపాదిస్తున్నప్పటికీ, అతను తన మొదటి జీతం తన భవిష్యత్తును నిర్ణయించేలా అనుమతించలేదు. అతను ప్రతి నెలా తన తల్లిదండ్రులకు సుమారు 5,000 నుండి 7,000 రూపాయలు పంపేవాడు. అంతేకాకుండా, 2023 చివరిలో అతను ఒక ఇండెక్స్ ఫండ్‌లో 5,000 రూపాయలతో తన మొదటి మ్యూచువల్ ఫండ్ SIPని ప్రారంభించాడు.2. ఖర్చులను తగ్గించుకుంటూ ఆదాయాన్ని పెంచుకోవడంపై దృష్టి పెట్టండి:
అర్జున్‌కు అక్టోబర్ 2024లో మొదటి పెద్ద జీతం పెంపు లభించింది. టెక్ మహీంద్రాలో సుమారు 15 నెలలు పనిచేసిన తర్వాత, అతను యాక్సెంచర్‌లో చేరాడు. అక్కడ అతని వార్షిక జీతం సుమారు రూ.12 లక్షలకు (సుమారు ₹1.2 మిలియన్లు) పెరిగింది. అతని నెలసరి స్థూల జీతం సుమారు రూ.1 లక్షకు (సుమారు ₹100,000) చేరుకుంది.
ఈ సమయంలో అతను ఉజ్జయిన్ నుండి బెంగళూరుకు మారాడు. అక్కడ జీవన వ్యయాలు ఎక్కువగా ఉండేవి. అయినప్పటికీ, అతను మొదట్లో ఖరీదైన జీవనశైలికి దూరంగా ఉన్నాడు. అతను తన సహోద్యోగులతో కలిసి ఒక అపార్ట్‌మెంట్‌లో నివసిస్తూ, తన నెలవారీ ఖర్చులను రూ.45,000 లోపు ఉంచుకున్నాడు.

ఐపీఎల్‌లో రూ.40 కోట్ల బ్లాక్‌మెయిల్ కలకలం.. ఆటగాళ్ల డిమాండ్లతో యజమానులకు టెన్షన్



ఐపీఎల్ 2027 మినీ వేలానికి ఇంకా సమయం ఉండగానే ఆటగాళ్ల ధరలపై ఆసక్తికర చర్చ మొదలైంది. వచ్చే ఏడాది జరగనున్న మెగా వేలానికి ముందు కొందరు స్టార్ ఆటగాళ్లు తమను జట్టులో కొనసాగించాలంటే ఏకంగా రూ.40 కోట్లు చెల్లించాలని ఫ్రాంచైజీలకు చెప్పినట్లు క్రిక్‌బజ్ నివేదిక వెల్లడించింది. మరోవైపు చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య నలుగురు ఆటగాళ్ల మార్పిడి పూర్తయింది. రిషభ్ పంత్, కుల్దీప్ యాదవ్ జట్ల మార్పు కూడా అధికారికంగా జరిగింది. హార్దిక్ పాండ్యా ట్రేడ్‌పై మాత్రం ఇంకా ఊహాగానాలు కొనసాగుతున్నాయి.
రిటెన్షన్ కోసం రూ.40 కోట్లు
క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం.. కొందరు అగ్రశ్రేణి ఆటగాళ్లు తమను జట్టులో కొనసాగించాలంటే రూ.40 కోట్లు చెల్లించాలని ఫ్రాంచైజీలకు చెప్పినట్లు సమాచారం. వేలంలోకి వస్తే భారీ ధర పలికే అవకాశం ఉందని భావిస్తున్న ఆటగాళ్లు ఈ దిశగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ డిమాండ్ చేసిన ఆటగాళ్ల పేర్లను నివేదిక వెల్లడించలేదు. ప్రస్తుతం ఐపీఎల్‌లో ఒక ఆటగాడి కోసం వేలంలో చెల్లించిన అత్యధిక ధర రూ.27 కోట్లు. 2025 వేలంలో రిషభ్ పంత్‌ను లక్నో సూపర్ జెయింట్స్ ఈ మొత్తానికి కొనుగోలు చేసింది. ఇప్పుడు రూ.40 కోట్ల రిటెన్షన్ డిమాండ్ నిజమైతే ఐపీఎల్‌లో ఆటగాళ్ల ధరల చర్చ మరింత వేడెక్కనుంది.
50 కోట్లకు పెరిగే అవకాశం
ప్రస్తుతం ఐపీఎల్‌లో ఒక్కో జట్టుకు ఆటగాళ్ల కొనుగోలు కోసం రూ.120 కోట్ల పర్స్ అందుబాటులో ఉంది. వచ్చే ఏడాది జరిగే మెగా వేలానికి ఈ మొత్తాన్ని సుమారు రూ.150 కోట్లకు పెంచే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. 2027 వేలం ప్రస్తుత వేలం చక్రంలో చివరి మినీ వేలం కానుంది. ఇందులో చాలా జట్లకు ఐదు నుంచి ఆరు ఖాళీలు మాత్రమే ఉండే అవకాశం ఉంది. అయితే 2028 సీజన్‌కు ముందు జరిగే మెగా వేలంలో జట్లు తమ ఆటగాళ్ల బృందాన్ని కొత్తగా నిర్మించుకోవాల్సి ఉంటుంది. ఈ మెగా వేలం 2027 డిసెంబర్‌లో జరిగే అవకాశం ఉందని కథనంలో పేర్కొన్నారు.
నవంబర్ 17 వరకు రిటెన్షన్ జాబితా గడువు
ఐపీఎల్ 2027 మినీ వేలానికి సంబంధించి ఆటగాళ్లను కొనసాగించే, విడుదల చేసే జాబితాలను సమర్పించేందుకు బీసీసీఐ గడువును రెండు రోజులు పొడిగించింది. తొలుత నవంబర్ 15గా నిర్ణయించిన చివరి తేదీని నవంబర్ 17కు మార్చింది. ఇక ఆటగాళ్ల వేలం డిసెంబర్ 16న గోవాలో జరగనుంది.

: గ్లోబల్ మార్కెట్లలో భారీ పతనం.. కొవిడ్ తర్వాత నాస్‌డాక్‌కు అతిపెద్ద షాక్!



గ్లోబల్ మార్కెట్లను అమ్మకాల సునామీ ముంచెత్తింది. కొవిడ్ కాలం తర్వాత అమెరికా నాస్‌డాక్ సూచీ అత్యంత తీవ్రమైన పతనాన్ని నమోదు చేసింది. అమెరికా మార్కెట్లు కరెక్షన్ జోన్‌లోకి ప్రవేశించగా, ఆసియా మార్కెట్లలోనూ అమ్మకాల తీవ్రత కనిపించింది. దక్షిణ కొరియాకు చెందిన కోస్పీ సూచీ లోయర్ సర్క్యూట్‌ను తాకింది. మరోవైపు జపాన్, తైవాన్ స్టాక్ ఎక్స్ఛేంజీలు బేర్ మార్కెట్ పరిధిలోకి వెళ్లాయి. ముఖ్యంగా టెలికాం, సెమీకండక్టర్, చిప్ తయారీ రంగాల షేర్లలో భారీ అమ్మకాలు నమోదయ్యాయి.ఇక ప్రపంచవ్యాప్తంగా మాంద్యం భయాలు పెరుగుతుండటంతో ఇన్వెస్టర్లు రిస్క్‌తో కూడిన ఈక్విటీ పెట్టుబడుల నుంచి వెనక్కి తగ్గుతున్నారు. తమ పెట్టుబడులకు భద్రత కల్పించుకునే క్రమంలో యూఎస్ డెట్ సాధనాలు, జపనీస్ యెన్, స్విస్ ఫ్రాంక్ వంటి సురక్షిత పెట్టుబడి మార్గాల వైపు మొగ్గు చూపుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు కూడా వారాంతంలో తీవ్ర క్షీణతను సూచించాయి. అయితే అంతర్జాతీయ మార్కెట్లలో తీవ్ర అమ్మకాల ఒత్తిడి కొనసాగుతున్నప్పటికీ, భారత స్టాక్ మార్కెట్లలో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు కొనుగోళ్లను కొనసాగించడం ఆసక్తికరంగా మారింది. గత ఐదు ట్రేడింగ్ సెషన్లుగా విదేశీ పెట్టుబడిదారులు భారత మార్కెట్లలో నికర కొనుగోళ్లు జరుపుతున్నారు. 2021 ఫిబ్రవరి తర్వాత అత్యధిక స్థాయిలో క్యాష్ మార్కెట్‌లో కొనుగోళ్లు చేపట్టిన విదేశీ ఇన్వెస్టర్లుగా నిలిచారు. అయితే, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారుల వైఖరిలో మాత్రం మార్పు కనిపించింది. 2009 తర్వాత అతిపెద్ద స్థాయిలో విక్రయాలు నమోదు కావడం దేశీయ మార్కెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు నిఫ్టీ సెంటిమెంట్ సూచిక అయిన రిలేటివ్ స్ట్రెంత్ ఇండెక్స్ 75 పాయింట్లకు చేరింది. ఇది గత రెండేళ్లలో నమోదైన అత్యధిక స్థాయి. మార్కెట్‌లో కొనుగోళ్ల జోరు అధికంగా ఉన్నట్లు ఈ స్థాయి సూచిస్తోంది. అయితే ఆర్ఎస్ఐ అధిక స్థాయికి చేరుకోవడంతో సమీప కాలంలో మార్కెట్‌లో కొంత విరామం లేదా స్వల్ప కరెక్షన్ వచ్చే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.
మొత్తంగా ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన పరిస్థితి నెలకొంది. అంతర్జాతీయ పరిణామాలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహాలు, మార్కెట్ సాంకేతిక సూచికలు రానున్న సెషన్లలో కీలకంగా మారనున్నాయి.

భారత్, న్యూజిలాండ్ రెండో వన్డేపై వరుణుడి పంజా.. మ్యాచ్ రద్దు ?



భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న ఐదు వన్డేల సిరీస్‌లో రెండో మ్యాచ్‌కు వరుణుడు అడ్డంకిగా మారనున్నాడు. తొలి వన్డేలో వర్షం కారణంగా డీఎల్ఎస్ పద్ధతిలో విజయం సాధించిన టీమిండియాకు ఇప్పుడు మరోసారి అదే సమస్య ఎదురయ్యేలా కనిపిస్తోంది. నవంబర్ 7న వెల్లింగ్టన్‌లోని హెచ్ఎన్ఆర్ఐ స్టేడియంలో రెండో వన్డే జరగనుంది. అయితే అక్కడి వాతావరణ పరిస్థితులు అభిమానులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. మ్యాచ్ పూర్తిగా జరగకపోవచ్చని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి.వంబర్ 7న వెల్లింగ్టన్‌లో వర్షం పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3 గంటలకు మ్యాచ్ ప్రారంభం కావాల్సి ఉంది. అదే సమయంలో వర్షం పడే సూచనలు ఉండటం టీమిండియాకు ఇబ్బందిగా మారింది. కొన్ని వాతావరణ అంచనాల ప్రకారం రోజంతా వర్షం కురిసే అవకాశం 60 నుంచి 75 శాతం వరకు ఉంది. శుక్రవారం కూడా వర్షం కారణంగా ఇరు జట్ల ప్రాక్టీస్ షెడ్యూళ్లు మారాయి. న్యూజిలాండ్ జట్టు ఇండోర్‌లో ప్రాక్టీస్ చేయగా, భారత జట్టు శిక్షణను రద్దు చేసుకుని హోటల్‌కే పరిమితమైంది.
గంటల వారీగా వర్షం అంచనాలు ఇవే
మధ్యాహ్నం 3 గంటలకు వర్షం పడే అవకాశం 55 శాతంగా ఉండగా, 4 గంటలకు ఇది 60 శాతానికి పెరగనుంది. సాయంత్రం 5 గంటలకు 20 శాతం, 6 గంటలకు 15 శాతం, 7 గంటలకు 20 శాతంగా వర్షం పడే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఈ సమయంలో మ్యాచ్ కొనసాగేందుకు కొంత అవకాశం కనిపిస్తోంది. అయితే రాత్రి 8 గంటలకు వర్షం ముప్పు మళ్లీ 43 శాతానికి చేరనుంది. రాత్రి 9 గంటలకు 47 శాతం, 10 గంటలకు 51 శాతం, 11 గంటలకు 40 శాతం వర్షం పడే అవకాశాలు ఉన్నట్లు అంచనా. దీంతో మ్యాచ్‌కు పలుమార్లు అంతరాయం కలిగే ప్రమాదం ఉంది.కోహ్లీ ఇన్నింగ్స్‌తో భారత్ విజయం
ఆక్లాండ్ వేదికగా జరిగిన తొలి వన్డేలోనూ వర్షం మ్యాచ్‌కు అంతరాయం కలిగించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌట్ అయింది. లక్ష్య ఛేదనలో భారత్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో వర్షం రావడంతో డీఎల్ఎస్ పద్ధతిలో లక్ష్యాన్ని 32 ఓవర్లలో 143 పరుగులుగా మార్చారు. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ 51 బంతుల్లో 74 పరుగులతో అద్భుతంగా ఆడాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 37 పరుగులు చేశాడు. దీంతో భారత్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో ఐదు వన్డేల సిరీస్‌లో టీమిండియా 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది.
మ్యాచ్ రద్దయితే సిరీస్ పరిస్థితి ఏంటి?
రెండో వన్డే పూర్తిగా వర్షం కారణంగా రద్దయితే ఇరు జట్లకు చెరో పాయింట్ లభిస్తుంది. అప్పుడు భారత్ సిరీస్‌లో 1-0 ఆధిక్యాన్ని కొనసాగిస్తుంది. అయితే వర్షం మధ్యలో తగ్గి మ్యాచ్ నిర్వహించేందుకు అవకాశం వస్తే ఓవర్లను కుదించి డీఎల్ఎస్ పద్ధతిలో ఫలితాన్ని నిర్ణయించే వీలుంటుంది. భారత కాలమానం ప్రకారం ఈ మ్యాచ్ నవంబర్ 7న ఉదయం 7:30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. టాస్ ఉదయం 7 గంటలకు జరగనుంది.

రైల్వే టికెట్ల ధరలు తగ్గింపు.. ఏకంగా రూ.75 డౌన్.. ప్రయాణికులకు భారీ గుడ్ న్యూస్..



ప్రయాణికులకు రైల్వేశాఖ గుడ్ న్యూస్ తెలిపింది. కొన్ని రైళ్లల్లో టికెట్ ధరలను తగ్గించనున్నట్లు ప్రకటించింది. 2027 జనవరి 1 నుంచి ఈ తగ్గింపు అమల్లోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. క్లాస్‌ను బట్టి ఒక్కో టికెట్‌పై రూ.15 నుంచి రూ.75 వరకు తగ్గవచ్చు. దేశవ్యాప్తంగా ఏకంగా 40కిపైగా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మార్చనుంది. వేగం అందుకోనందున జనవరి 1 నుంచి ఈ రైళ్లకు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ హోదా తప్పించి సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మార్చనుంది. సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు టికెట్ ధరలు వేర్వేరుగా ఉంటాయి. దీంతో రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని టికెట్ ధరలే వీటికి వర్తించనున్నాయి. దాదాపు 47 రైళ్లల్లో టికెట్ ఛార్జీలు తగ్గనున్నాయి.గంటకు 55 కిలోమీటరల్ వేగం అందుకోవడంలో వైఫల్యం చెందినందుకు దేశంలోని 47 సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను జనవరి 1 నుంచి సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లుగానే పరిగణించనున్నట్లు రైల్వేశాఖ తెలిపింది. సూపర్ ఫాస్ట్ హోదాను తొలగించి సాధారణ ఎక్స్‌ప్రెస్ సర్వీసులుగా నడపనుంది. దీంతో వీటిల్లో టికెట్ల ధరలు తగ్గుతుండటం సామాన్య ప్రయాణికులకు ఊరటగా చెప్పవచ్చు. అలాగే ఈ రైళ్ల నెంబర్లు, సర్ ఛార్జ్ మారనుండగా.. టైమ్ షెడ్యూల్ ఎప్పటిలాగే ఉంటుంది. రైల్వే నిబంధనల ప్రకారం సూపర్ ఫాస్ట్ ట్రైన్ రెండు దిశల్లోనూ కనీసం గంటకు 55 కిలోమీటర్ల వేగంతో వెళ్లాల్సి ఉంటుంది. రైల్వేశాఖ పరిశీలనలో ఈ రైళ్లు వేగాన్ని అందుకోలేకపోయినట్లు తేలింది. దీంతో రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్‌లుగా వాటిని మార్చనున్నారు. సెంట్రల్ రైల్వే పరిధిలో జూమీ-పూణే ప్రగతి, గయా-అయోధ్య కంటోన్మెంట్ తులసితో సహా 18 సర్వీసులు ఉన్నాయి. ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో సప్త క్రాంతితో సహా 20 సర్వీసులు ఉన్నాయి. తానక్‌పూర్-ఢిల్లీ, డెహ్రాడూన్-కాథ్‌గోడమ్‌తో సహా మరో ఎనిమిది ఉత్తరాఖండ్ మార్గాలు ఉండగా.. గోవా ఎక్స్‌ప్రెస్ కూడా జాబితాలో ఉంది.
చార్జీలు ఎంత తగ్గుతాయంటే..?
ఈ రైళ్లల్లో జనవరి 1 నుంచి సెకండ్ క్లాస్ టికెట్ల ధర రూ.15, స్లీపర్ క్లాస్ చార్జీ రూ.30, ఏసీ చైర్ కార్, థర్డ్ టైర్, సెకండ్ టైర్ టికెట్ ధర రూ.45, ఏసీ ఫస్ట్ క్లాస్ టికెట్ల ధర రూ.75



ఆ పాట కోసం చాలా కష్టపడా

తెలుగు సినిమా పరిశ్రమలో "సీత" వంటి బలమైన పాత్రలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి అంజలి, 2016లో విడుదలైన అల్లు అర్జున్ చిత్రం "సరైనోడు"లోని ఐటెం సాంగ్‌లో కనిపించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. తనను ఆ క్యారెక్టర్‌లో చూసిన వారు "అంజలినేనా?" అని కళ్లు నలుముకుని చూశారని ఆమె తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. ఈ ఐటెం సాంగ్‌ను ఒప్పుకోవడానికి గల కారణాలను, షూటింగ్ అనుభవాలను, అల్లు అర్జున్‌తో కలిసి పనిచేసిన తీరును అంజలి ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు.సాధారణంగా నటిగా ఒక ఇమేజ్ ఉన్నప్పుడు ఐటెం సాంగ్స్ చేయడానికి చాలా ఆలోచిస్తారు. అయితే అంజలి ఈ పాటను ఒప్పుకోవడానికి వెనుక పెద్దగా ప్రణాళికలేమీ లేవని స్పష్టం చేశారు. "నాకు సడన్‌గా నచ్చింది చేయాలనిపించింది. పాట చాలా బాగా నచ్చింది. సరదాగా ఉంటుంది కదా, ఒకసారి ప్రయత్నిద్దాం అనిపించింది" అని ఆమె వెల్లడించారు. అదృష్టవశాత్తు ఆ పాట పెద్ద హిట్ అవ్వడంతో ఆమె నిర్ణయం సరైనదని రుజువైంది.సాధారణంగా నటిగా ఒక ఇమేజ్ ఉన్నప్పుడు ఐటెం సాంగ్స్ చేయడానికి చాలా ఆలోచిస్తారు. అయితే అంజలి ఈ పాటను ఒప్పుకోవడానికి వెనుక పెద్దగా ప్రణాళికలేమీ లేవని స్పష్టం చేశారు. "నాకు సడన్‌గా నచ్చింది చేయాలనిపించింది. పాట చాలా బాగా నచ్చింది. సరదాగా ఉంటుంది కదా, ఒకసారి ప్రయత్నిద్దాం అనిపించింది" అని ఆమె వెల్లడించారు. అదృష్టవశాత్తు ఆ పాట పెద్ద హిట్ అవ్వడంతో ఆమె నిర్ణయం సరైనదని రుజువైంది.ఈ పాట కోసం అంజలి ఎంత కష్టపడ్డారో ఆమె మాటల్లోనే తెలిసింది. "ఆ సాంగ్‌కి నేను యాక్చువల్‌గా చాలా హార్డ్‌వర్క్ చేశాను. ఎందుకంటే, అప్పుడు నాకు ఆ సాంగ్, బాలకృష్ణ గారితో చేసిన డిక్టేటర్ ఇంటర్వెల్ బ్లాక్ కలిపి సైమల్టేనియస్‌గా జరుగుతూ ఉండేది" అని తెలిపారు. రాత్రిపూట "సరైనోడు" పాట షూటింగ్‌లో పాల్గొని, మరుసటి రోజు ఉదయం "డిక్టేటర్" టాకీ పోర్షన్ షూట్‌కు వెళ్లడం, తిరిగి వచ్చి రాత్రి "సరైనోడు" సాంగ్ షూట్ చేయడం ఇలాగే చేశామని ఆమె గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో దర్శకుడు బోయపాటి శ్రీను తన అలసటను గమనించి, "చాలా టైర్డ్‌గా ఉన్నారు, వెళ్లి ఒక గంట విశ్రాంతి తీసుకోండి" అని చెప్పడం తనకు ఇప్పటికీ బాగా గుర్తుందని అంజలి పేర్కొన్నారు.

ఈ పాట కోసం అంజలి ఎంత కష్టపడ్డారో ఆమె మాటల్లోనే తెలిసింది. "ఆ సాంగ్‌కి నేను యాక్చువల్‌గా చాలా హార్డ్‌వర్క్ చేశాను. ఎందుకంటే, అప్పుడు నాకు ఆ సాంగ్, బాలకృష్ణ గారితో చేసిన డిక్టేటర్ ఇంటర్వెల్ బ్లాక్ కలిపి సైమల్టేనియస్‌గా జరుగుతూ ఉండేది" అని తెలిపారు. రాత్రిపూట "సరైనోడు" పాట షూటింగ్‌లో పాల్గొని, మరుసటి




అంతర్జాతీయ వేదికపై విజయ్ సేతుపతి

తమిళ చిత్ర పరిశ్రమలో విలక్షణ నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న విజయ్ సేతుపతి మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకోబోతున్నారు. కేవలం దక్షిణాది సినిమాలకే పరిమితం కాకుండా, తన నటనతో దేశవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న ఈ నటుడు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సినీ ప్రతిభకు ప్రతినిధిగా నిలవబోతున్నారు. 54వ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల వేడుకలో అవార్డు ప్రెజెంటర్‌గా వ్యవహరించే అవకాశం దక్కించుకున్నారు. ఈ వార్తతో సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. నవంబర్ 23, 2026న న్యూయార్క్‌లో 54వ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల వేడుక జరగనుంది. ఈ వేడుకలో అవార్డులు అందించే ప్రెజెంటర్లలో విజయ్ సేతుపతి కూడా ఒకరిగా ఉండనున్నారు. అంతే కాదు ఈ ఘనత సాధించిన తొలి భారతీయ నటుడిగా విజయ్ సేతుపతి చరిత్ర సృష్టించబోతున్నారు.గతంలో ప్రియాంక చోప్రా 2016లో జరిగిన 68వ ప్రైమ్‌టైమ్ ఎమ్మీ అవార్డుల వేడుకలో హాలీవుడ్ నటుడు టామ్ హిడిల్‌స్టన్‌తో కలిసి అవార్డును అందించారు. అయితే ఇంటర్నేషనల్ ఎమ్మీ వేడుకలో ప్రెజెంటర్‌గా వ్యవహరించడం విజయ్‌కు ప్రత్యేకమైన గుర్తింపుగా నిలవనుంది. ఈ అంతర్జాతీయ వేదికపై భారతీయ ప్రతిభకు మరిన్ని అవకాశాలు కల్పించడంలో నిర్మాత, ఇంటర్నేషనల్ అకాడమీ ఆఫ్ టెలివిజన్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ బోర్డు సభ్యురాలు కవితా గుప్తా కీలక పాత్ర పోషిస్తున్నారు. 2024లో హాస్యనటుడు వీర్ దాస్‌ను ఇంటర్నేషనల్ ఎమ్మీ వేడుకకు హోస్ట్‌గా తీసుకురావడంలోనూ ఆమె పాత్ర ఉంది.ఇక విజయ్ సేతుపతి సినిమాల విషయానికొస్తే ఇటీవల బత్తా అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. 1986 నాటి మద్రాస్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో ఆయన గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించారు. అలాగే విజయ్ సేతుపతి చేతిలో పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నాయి. ముఖ్యంగా దర్శకుడు

ఇప్పుడు సోషల్ మీడియాలో ఎక్కడ చూసిన ఈ అమ్మడే



తెలుగు చిత్రసీమలో హీరోయిన్స్ మాత్రమే కాకుండా, బలమైన సహాయక పాత్రలతో ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసే నటీమణులు కొందరే ఉంటారు. కొన్నిసార్లు వీరు తమ అద్భుతమైన నటన, ఆకట్టుకునే గ్లామర్‌తో కొన్నిసార్లు మెయిన్ హీరోయిన్ కంటే ఎక్కువగా గుర్తుండిపోతారు. అలాంటి వారిలో పైన కనిపిస్తున్న నటి ఒక్కరు. ఆ ముద్దుగుమ్మను గుర్తుపట్టారా.? చాలా సినిమాల్లో తన క్యూట్ నటనతో ప్రేక్షకులను కవ్వించినా అదితి మ్యాకల్. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో విజయ్ దేవరకొండ కథానాయకుడిగా వచ్చిన ట్రెండ్ సెట్టర్ మూవీ 'అర్జున్ రెడ్డి'. ఈ సినిమా విజయ్ దేవరకొండకు స్టార్‌డమ్ తెచ్చిపెట్టడమే కాకుండా, అందులో నటించిన ప్రతి ఒక్కరికీ మంచి గుర్తింపునిచ్చింది. ఈ చిత్రంలో విజయ్ ఫ్రెండ్ పాత్రలో నటించి, తన నటనతో ప్రేక్షకులకు దగ్గరైంది అదితి మ్యాకల్. అదితికి చిన్నతనం నుంచే కళలపై ఎంతో మక్కువ. చిన్న వయసులోనే కూచిపూడి నృత్యంలో శిక్షణ పొంది పలు వేదికలపై ప్రదర్శనలు ఇచ్చింది. ఆ తర్వాత ఫ్యాషన్ డిజైనింగ్ పూర్తి చేసి, పలు మోడలింగ్ షోలలో సందడి చేసింది. నటనపై ఉన్న మక్కువతో మొదట యూట్యూబ్ వెబ్‌సిరీస్‌లు, షార్ట్ ఫిలిమ్స్ ద్వారా ప్రయాణం ప్రారంభించింది.'పాప పి సుశీల', 'ముద్దపప్పు ఆవకాయ్', 'పాష్ పోరీస్' వంటి ప్రసిద్ధ వెబ్ సిరీస్‌లలో నటించి మంచి పేరు తెచ్చుకుంది. వెబ్ సిరీస్‌ల నుంచి వెండితెరకు ప్రమోట్ అయిన అదితి, 'అర్జున్ రెడ్డి'తో పాటు 'అమీ తుమీ', 'రాధ', 'మిఠాయ్', 'దెబ్బకు ఠా.. దొంగల ముఠా', 'నేనులేని నా ప్రేమకథ' వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించింది. కొన్ని సినిమాల్లో హీరోయిన్‌గా కనిపించినప్పటికీ, క్యారెక్టర్ ఆర్టిస్టుగానే ఆమెకు మంచి గుర్తింపు లభించింది. సినిమాల్లో ఎక్కువగా నటనతో ఆకట్టుకున్న ఈ వయ్యారి, సోషల్ మీడియాలో మాత్రం తన స్టైలిష్ అండ్ గ్లామరస్ పిక్స్‌తో నెటిజన్లను ఆశ్చర్యపరుస్తోంది. రీసెంట్ గా ఓ సినిమా కార్యక్రమంలో పాల్గొన్న అదితి మ్యాకల్ తన అందంతో అందరి దృష్టిని ఆకర్షించింది.సింపుల్ లుక్ లోనే కనిపించినప్పటికీ ఈ అమ్మడి అందానికి అందరూ ఫిదా అయ్యారు. చీరకట్టులో ఎంతో అందంగా ఉన్న ఈ సుందరి ఫోటోలు,



రామాయణంలో మరో సర్‌ప్రైజ్..! కీలక పాత్రలో కనిపించిన టాలీవుడ్ విలన్.. ఎవరో గుర్తుపట్టారా.?

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు ప్రస్తుతం ఎక్కడ చూసినా రామాయణ సినిమా గురించే చర్చ జరుగుతోంది. భారీ బడ్జెట్‌తో, అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ పౌరాణిక చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా సినిమాలోని స్టార్ కాస్టింగ్, పాత్రల చిత్రీకరణ, విజువల్ ఎఫెక్ట్స్ గురించి సోషల్ మీడియాలో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో సినిమా చివర్లో ఇచ్చిన ఓ సర్‌ప్రైజ్ తెలుగు ప్రేక్షకులను ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న రామాయణ సినిమాపై మొదటి నుంచే భారీ హైప్ క్రియేట్ అయింది. భారీ బడ్జెట్, అద్భుతమైన విజువల్స్‌తో ఈ ఇతిహాసాన్ని వెండితెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ సినిమాలో రాముడి పాత్రలో బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, ప్రమోషనల్ కంటెంట్ ఆయన పాత్రపై అంచనాలను పెంచాయి.సీతమ్మ పాత్రలో సాయిపల్లవి కనిపిస్తుండగా, రావణాసురుడిగా కన్నడ స్టార్ హీరో యశ్ నటిస్తున్నారు. వీరిద్దరి పాత్రలపై కూడా ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. బాలీవుడ్ సీనియర్ హీరో సన్నీ డియోల్ హనుమంతుడి పాత్రను పోషిస్తున్నారు. అయితే సినిమా ప్రమోషన్లలో ఆయన లుక్‌ను పూర్తిగా రివీల్ చేయకపోవడంతో హనుమంతుడిగా సన్నీ ఎలా కనిపించబోతున్నారనే ఆసక్తి మరింత పెరిగింది. మొదటి భాగం చివర్లో హనుమంతుడి పాత్రను పరిచయం చేస్తూ హనుమాన్ చాలీసాను వినిపించడం ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని కలిగిస్తోంది. రెండో భాగంపై ఆసక్తి పెంచేలా ఈ సన్నివేశాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. హనుమంతుడిగా సన్నీ డియోల్ ఎంట్రీ ఇచ్చినప్పటికీ ఆయన పూర్తి రూపాన్ని చూపించకపోవడం అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. రెండో భాగంలో ఆయన పాత్రకు మరింత ప్రాధాన్యం ఉండనుందని ప్రేక్షకులు భావిస్తున్నారు. ఇక సినిమా ఎండ్ టైటిల్స్‌లో రావణాసురుడి కుమారుడు ఇంద్రజిత్ అలియాస్ మేఘనాథుడి పాత్రను పరిచయం చేయడం మరో ఆసక్తికరమైన అంశం. ఈ పాత్రలో బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయల్ కనిపించడం తెలుగు ప్రేక్షకులకు సర్‌ప్రైజ్‌గా మారింది. నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' సినిమాతో రాఘవ్



సమ్మర్ హాలీడేస్ సినిమా రివ్యూ..

రావూరి వెంకటేష్ అలియాస్ =ఎ (అరుణ్ దేవ్) ఎప్పుడూ చదువుల్లోనే ఉండాలని.. ఆ విషయంలో రాజీ పడకూడదని అతని తండ్రి (హర్షవర్ధన్) కఠినంగా ప్రవర్తిస్తుంటాడు. కానీ, ఆర్వీకి మాత్రం కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా బయటి ప్రపంచాన్ని చూడాలనే కోరిక ఉంటుంది. తండ్రికి ఇది ఇష్టం ఉండదు. ఈ నేపథ్యంలో 2001 వేసవి సెలవుల్లో ఆర్వీ వాళ్ల అమ్మ జానకి (వాసుకి) అతడిని తోటవారిపాలెంలోని వాళ్ల అమ్మమ్మ గారింటికి తీసుకువెళుతుంది. అక్కడ =ఎకి చదువులంటే పెద్దగా ఆసక్తి లేని, డబ్బు సంపాదించి లైఫ్‌ని ఎంజాయ్ చేయాలనుకునే ఖఎ అలియాస్ కాశీ వెంకటేశ్వర్లు (రోహన్ రాయ్) పరిచయం అవుతాడు. ఇద్దరి ఆలోచనలు వేరైనా, వారిద్దరూ త్వరగానే మంచి మిత్రులుగా మారిపోతారు. ఆ తర్వాత వాళ్ళ జీవితాల్లో చోటుచేసుకున్న పరిణామాలే ఈ సినిమా కథ.

కథనం:సినిమా మొదలవ్వడమే ప్రేక్షకులను ఒక అందమైన గతం వైపు తీసుకువెళుతుంది. పట్నంలో చదువుల ఒత్తిడి, కఠినమైన తండ్రి భయం మధ్య నలిగిపోయే ఒక పిల్లాడు.. వేసవి సెలవులొస్తే చాలు అమ్మమ్మ ఊరికి ఎప్పుడు వెళ్దామా అని ఎదురుచూసే ఆనాటి రోజులను డైరెక్టర్ కళ్లకు కట్టినట్లు చూపించాడు. ఫస్టాఫ్ మొత్తం దాదాపుగా 90వ దశకం నాటి జ్ఞాపకాల చుట్టూనే చాలా ఆహ్లాదంగా సాగుతుంది. మామిడి తోటల్లో స్నేహితులతో కలిసి అల్లరి చేయడం, ఊరి చెరువుల్లో ఈతకు వెళ్లడం, మండుటెండలో గల్లీ క్రికెట్ ఆడటం లాంటి సీన్స్ చూస్తున్నప్పుడు ప్రతి ఒక్కరికీ తమ బాల్యం గుర్తుకురాక మానదు. దర్శకుడు ఈ వాతావరణాన్ని ఎక్కడా బలవంతంగా ఇరికించినట్లు కాకుండా కథలో బాగంగా చాలా నేచురల్‌గా తీర్చిదిద్దాడు. చదువులంటే ఇష్టం లేని ఒక పల్లెటూరి కుర్రాడు, ప్రపంచం ఏంటో చూడాలనుకునే ఒక పట్నం కుర్రాడు.. ఈ ఇద్దరు భిన్న మనస్తత్వాలు ఉన్న పిల్లల మధ్య స్నేహం చిగురించే తీరు, వాళ్ళు పంచుకునే భావోద్వేగాలు ప్రేక్షకులకు మంచి వినోదాన్ని పంచుతాయి. అయితే, అసలు సమస్య అంతా సెకండాఫ్‌లోనే మొదలవుతుంది. ఇంటర్వెల్ తర్వాత కథనం నెమ్మదిగా రొటీన్ ట్రాక్‌లోకి వెళ్లిపోతుంది. తర్వాతి సీన్ ఏంటనేది ఆడియన్స్ చాలా సులభంగా ఊహించేలా స్క్రీన్ ప్లే సాగుతుంది.

కథలో ఎలాంటి మలుపులు కానీ, కొత్తదనం కానీ లేకపోవడంతో కొన్ని చోట్ల బోర్ కొట్టే అవకాశం ఉంది. అయినప్పటికీ, మెయిన్ క్యారెక్టర్స్ మధ్య ఉండే ఎమోషనల్ బాండింగ్, వారు ఎదుర్కొనే చిన్నపాటి సంఘర్షణలు ఆ లోపాన్ని కొంతవరకు కవర్ చేసి సినిమాపై ఆసక్తి తగ్గకుండా చూసుకున్నాయి. అదే సమయంలో, దర్శకుడు తీసుకున్న కొన్ని సినిమాటిక్ లిబర్టీస్ ఏమాత్రం కన్విన్సింగ్ గా అనిపించవు. ముఖ్యంగా సినిమా ఫస్ట్ సీన్ నుంచి కొడుకును ఒక మిషన్ లాగా చదివించాలని చూసే కఠినమైన తండ్రి

హైకూ మనల్ని ఎగ్జైట్ చేసే సిన్సియర్ లవ్ స్టోరీ.

ఏగన్, కోర్ట్ ఫేమ్ శ్రీదేవి, ఫెమినా జార్జ్ హీరో హీరోయిన్లుగా విజన్ సినిమా హౌస్ బ్యానర్‌పై రూపొందుతోన్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'హైకూ'.యువరాజ్ చిన్నసామి రచన, దర్శకత్వంలో డా. డి. అరుళానందు, మాథ్యూ అరుళానందు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అక్టోబర్ 23న మూవీ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన రిలీజ్ ప్రెస్‌మీట్‌కు ప్రముఖ రచయిత, నిర్మాత కోన వెంకట్, డైరెక్టర్ రామ్ జగదీశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీదేవి మాట్లాడుతూ.. "ఈ సినిమా నా హార్ట్ కి చాలా బాగా కనెక్ట్ అయింది. ఈ సినిమా కథ వినగానే బాగా నచ్చి వెంటనే ఓకే చేశా. లవ్ లో ఉన్నా, రిలేషన్ షిప్ లో ఉన్నా, మ్యారీడ్ కపుల్ అందరికీ ఈ సినిమా నచ్చుతుంది. లవ్ ఉన్న కాంప్లికేషన్స్ మొత్తం ఈ సినిమాలో చూస్తారు. ఏగన్ డౌన్ తో ఎర్త్. ఆయనతో కలిసి పని చేయడం హ్యాప్పీగా అనిపించింది. నన్ను చాలా కూల్ గా హ్యాండిల్ చేసిన డైరెక్టర్ గారికి చాలా థ్యాంక్స్. మా టీం మొత్తం కూడా ఎంతో సహకరిస్తూ పని చేశారు. ఇది నా ఫస్ట్ డెబ్యూ. మీరంతా అక్టోబర్ 23 న థియేటర్ లో ఎంజాయ్ చేయండి"" అన్నారు.హీరో ఏగన్ మాట్లాడుతూ.. "నేను ఇండస్ట్రీకి కొత్త. హైకూ సినిమా క్లోజ్ తో మై హార్ట్. బాగా కష్టపడి సినిమా చేశాము. ఈ సినిమాపై నేను చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాను. మ్యూజిక్ డైరెక్టర్ సిద్దు కుమార్

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224